# హాస్యానందం

తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక

23వ నవ్వుల వసంతం

సంపూర్ణ హాస్య మాసపత్రిక
ఫిబ్రవరి-2025 ₹25



ప్రతి సభకు ఆయన ఒక అలంకారం...
అందమైన మాటలను ముత్యాల స్వరంలా అల్లుతారు...
మధురమైన పదాల పరిమళం చల్లుతారు....
భాషలో, భావంలో పవిత్రతను విరజిమ్ముతారు...
ఎక్కడున్నా సభను నవ్యంగా, భవ్యంగా, దివ్యంగా, రసరమ్యంగా,
కమనీయంగా, రమణీయంగా మారుస్తారు.



# డా॥ కె.వి.రమణ IAS(R) గారికి
# 73వ
# జన్మదిన
# శుభాకాంక్షలు



**యువకళావాహిని**
**50 ఏళ్ళు (1975-2025) పూర్తి చేసుకున్న సందర్భంగా...**
**డా॥ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్**
**30 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా...**
**హాస్యానందం మాసపత్రికకు శుభాకాంక్షలు.**

'సాంస్కృతిక బంధు'
**శ్రీ సారిపల్లి కొండలరావు**
అధ్యక్షులు,
డా॥అక్కినేని నాగేశ్వరరావునాటక కళాపరిషత్
సెల్: 9849018190





**లంక లక్ష్మీనారాయణ**
అధ్యక్షులు, యువకళావాహిని
సెల్: 9391374779

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక | జీ'వనం'లో నవ్వు నవ వసంతం

**ఫిబ్రవరి-2025**

21వ సంవత్సరం
248 వ సంచిక

ముఖచిత్రం: సమంత



Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**



*Full Pillar* : Bnim
*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*
Dr. K.Ramakrishna, Bachi
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar,
GopalKrishna, Gandhi, Nagisetty,
Bomman, Dayakar, Sangram, Krishna

*D.T.P:* P. Ramalakshmi, 9440304993
*Digital Media Director:* Surya

*Publisher & Editor-*
*Ramu.P*

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
G.Venkat Reddy,
Srikanth sarma,
NCCF




| సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలు ఉచితం) | 2 సంవత్సరాల చందా-రూ.600/- (పోస్టల్ చార్జీలు ఉచితం) |
|---|---|

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay *or* Ppay # **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.

Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

## కథలు


| | | |
|---|---|---|
| ఒక కోటిలింగం ఇద్దరు కళలు | -ఎస్.వి.ఎమ్.నాగ గాయత్రి | -22 |
| సన్మాన వైరాగ్యం | -డాక్టర్ రావెళ్ళ శ్రీనివాసరావు | -32 |
| సీతాకోకచిలుక | -బొందల నాగేశ్వరరావు | -38 |
| హతవిధి | -అభిమన్యు | -40 |
| దశమగ్రహం | -పంతంగి శ్రీనివాసరావు | -42 |
| అతి రహస్యం బట్టబయలు | -కాశీ విశ్వనాథం పట్రాయుడు | -46 |


## స్పెషల్స్



| | | |
|---|---|---|
| శ్రీ గుదిబండి వెంకట రెడ్డి, హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు | | -12 |
| ట్రెండింగ్ లవ్ | | -21 |
| డా॥కె.వి.రమణగారి పుట్టిన్రోజు ప్రత్యేకం | | -25 |
| బ్లేడుతో పెన్సిల్ చెక్కుకోవాలి... చెయ్యి కోసుకో కూడదు! | -ఎ.మురళీధర్ | -47 |



## శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -10 |
| వాక్చిత్రం | -సుధామ | -19 |
| కొత్త పుస్తకాలు | | -29 |
| వెనక్కి వెళ్ళే కథలు | - గంగాధర్ వడ్లమన్నాటి | -30 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -48 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |


## సీరియల్


| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -14 |



## కార్టూన్ శీర్షికలు




| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -16 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -17 |
| రిటైర్డ్ లైఫ్ | -బొమ్మన్ | -35 |
| నెల నెలా నవ్వుల వెన్నెల | | -36 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -45 |


### ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- శర్మ
- బీవీఎస్
- టి.ఆర్.బాబు
- సాయికృష్ణ
- సునీల్
- తోపల్లి ఆనంద్
- పద్మ
- టి.భాస్కర్
- రామ్‌శేషు
- గాంధీ
- ప్రసిద్ధ
- శేషిరెడ్డి
- శిరి
- వాడ్రేవు
- చక్రవర్తి
- మోహన్ కుమార్
- భాను
- మోహన్ కుమార్
- కామేష్
- గోపాలకృష్ణ
- అరుణ్
- లేపాక్షి
- నాగిశెట్టి
- కాశ్యప్
- కుష్మిత
- రవీంద్ర
- బొమ్మన్
- గిరి
- దొరశ్రీ
- శేఖర్
- ఓంకార్
- డేవిడ్
- వర్చస్వీ
- షేక్ సుభాని
- రాగతిరమ
- శ్రీకుమార్
- జెఎన్నెమ్
- శ్రీధర్
- దాస్
- శేఖర్‌బాబు
- శంబంగి
- ప్రసాద్ కాజ
- రావు

**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించ పరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**'ఎం**దరో మహానుభావులు అందరికీ వందనములు...' ఈ కీర్తనలోని ఈ వాక్యం అందరూ విన్నదే... అందరికీ తెలిసినదే... ఈ మాటకి అర్హులు అవునో కాదో తెలియకుండానే కొంతమంది గురించి తరచూ వాడేస్తున్నాం!

'మహానుభావులు' అనిపించుకోవాలని చాలామంది ఎన్ని పాట్లు పడుతున్నారో... పాపం! ఎవరెన్ని మంచి పనులు చేస్తున్నామనుకున్నా... 'ఒక' పనిచేయడానికి మాత్రం 'పెద్ద మనసు' కావాలి!.. అది ఎదుటివాని గొప్పతనాన్నో... విజయాన్నో గమనించి అభినందించటం! చాలామంది ఈ విషయంలో వెనుబడిపోతున్నారనేది నిజం! ఒక సినిమా చూసి, అందులో మంచి చెడులు, కలక్షన్స్ గురించి వాదులాడుకునే ఈ 'మహానుభావులు' వారికి పరిచయమున్న ఒక 'వ్యక్తి'కి మాత్రం భుజం తట్టే పనులు చేయట్లేదు.

ఈ 'సోకాల్డ్' మహానుభావులు మనం ఎలాంటి మంచి పనులు చేసినా గమనించరు. చివరకు వారికే సహాయం చేసినా... దాన్ని కూడా చూసీ చూడనట్లు ఉండిపోతారు.

చాలామంది 'నేనింత... నేనంతా...' అంటూ వారి గొప్పలు చెప్పటంతోనే సరిపోతుంది. ఎదుటివారి మాటలు సైతం కనీసం వినరు. ఇక వీరు 'గొప్పవారు' ఎలా అవుతారు చెప్పండి? మన గురించి మనం గొప్పలు చెప్పుకోవటం కాదు... మన గురించి నలుగురు చెప్పుకునేలా మన ప్రవర్తన ఉండాలి! ఇతరులు చెప్పింది వినడం, అందులోంచి మంచి తీసుకోవటం మంచి లక్షణం. అలాగే ఆ తీసుకున్న మంచి గురించి సదరు వ్యక్తికి చెప్పగలిగితే సంస్కారం అనిపించుకుంటుంది.

'ఎందరో మహానుభావులు..." వారిలో ఒకరు– మా డా॥ కె.వి.రమణగారు. ఎదుటివారిని గౌరవించటం... వారి మాటలు వినటం... నచ్చితే అప్పటికప్పుడు చెప్పటం... అవసరమైనవారికి సహాయం చేయటం... ఇలాంటి ప్రత్యేకతలెన్నో మనం వీరి దగ్గర్నుంచి నేర్చుకోవాలి.

హాస్యానందానికి ఎంత చేయూతనిస్తున్నారో ఆయనకు, నాకు మాత్రమే తెలుసు! ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ...

మనకు పరిచయమున్న వ్యక్తుల్లో ఎంతమంది మహానుభావులు ఉన్నారో ఒక్కసారి వేళ్ళ మీద లెక్కించుకుందాం! అలాంటి వారిని గౌరవిద్దాం!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....









✦ **తూలుగు రమణారావు, అక్కరాపల్లి**

**అం**దమైన ముఖచిత్రంతో వెలువడిన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రత్యేక సంచిక ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కృత్రిమమేత, ఆర్టిఫీషియల్ లవ్ కథలు బాగున్నాయి. జయదేవ్-అబ్బాయిపెళ్ళి, సరసి-నవ్వు కొమ్మచ్చి కార్టూన్స్ ఎన్నిసార్లు చదివించాయో. స్పెషల్‌గా అందించిన ఏఐ మాయ, ఏఐ ఫన్, ఏఐ గురించిన కథా సంగతులుతో ఎంతో విలువైన సంచికను మా చేతుల్లో పెట్టిన హాస్యానందం టీంకు కృతజ్ఞతలు.

✦ **పి.వి. పద్మావతి, సికింద్రాబాద్**

**ము**ఖచిత్రంలో ఈసారి అమ్మాయి కృత్రిమమేధ నిర్మించిన బొమ్మ బాగుంది కానీ AI అమ్మాయి కంటే ప్రతిసారి ఇచ్చే సినిమా స్టార్ 'ముద్దుల గుమ్మలు' యే ముచ్చటగా ఉన్నారు. 'హాయ్ సానందం' లో మనుషులు నైతికంగా దిగజారకుండా,AI ను వాడుకోవాలి అని సూచన - హెచ్చరిక ఇచ్చారు (రాము గారు). ఇది మంచి మాట. వినూత్నంగా కార్టూన్లు ఉన్నాయి ఈ సంచికలో.

✦ **నివ్రితి పి.ఎస్., హైదారాబాద్**

**నూ**తన సంవత్సర జనవరి 2025 సంచికను నవీన-శాస్త్ర విషయం అయిన కృతిమ మేధ ... ఎ.ఐ. (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ప్రత్యేక సంచికగా భేషుగ్గా తీర్చిదిద్దారు. సంపాదకులకు-వారి బృందానికి ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు. ఎందుకంటే ఇక్కడ హాయిగా నవ్వుకునే జోకులు మాత్రమే కాదు, AI గురించి విషయాలు కూడా తెలియపరిచారు. అంటే ఇది 3 ఇన్ 1 సంచిక: 1.జ్ఞానం, 2. విజ్ఞానం, 3.ఆరోగ్యకరమైన హాస్యం ... మూడింతల లాభం. దీనిని అట్టే దాచి పెట్టుకుంటాం. నాగిశెట్టి గారి రచన-ఏమిటీ AI...ఏమా కథ!? ద్వారా AI ఆల్ రౌండర్ అని తెలుసుకున్నాం. వాక్‌చిత్రంలో (సుధామ గారు) చిత్ర-విచిత్రంగా పదాలు-వాక్యాలు వాడి, ఓ ఆడేసారు... కడుపుబ్బా నవ్వించారు. ఉదాహరణకు కొన్ని: కృత్రిమ మేధ - తెలివి... తెలివి తెల్లారినట్టుంది, అతి తెలివి తేటలు ... వెధవ తెలివి తేటలు.

✦ **ఆర్.జయశ్రీ, బెంగళూరు.**

**జ**నవరి హాస్యానందం ఎ.ఐ ప్రత్యేక సంచిక సూపర్. ఒక కొత్త ప్రక్రియ తెలియగానే మనం చేసే వెర్రి పనులు ఎన్ని విధాలుగా ఉంటాయో నవ్వుల పూతతో అందించిన తీరు అభినందనీయం.


NORTH COASTAL ANDHRA CARTOONISTS FORUM
VISAKHAPATNAM

# NCCF
(North Coastal Andhra Cartoonists Forum )

## వారి ఆధ్వర్యంలో కార్టూన్ల పోటీ 2025

**విశ్వావసునామ సంవత్సర ఉగాది సందర్భంగా జాతీయస్థాయి కార్టూన్ పోటీలు NCCF వారు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలో వచ్చిన కార్టూన్లలో అత్యుత్తమమైన పది కార్టూన్లను ఎంపికచేసి ఒక్కోదానికి రూ 1000/- చొప్పున నగదు బహుమతి అందజేయనున్నారు.**

**నిబంధనలు:**

✦ దేశవిదేశాల్లోనున్న తెలుగుకార్టూనిస్టులందరూ పాల్గొనవచ్చును.

✦ ప్రతీ కార్టూనిస్టూ మూడు కార్టూన్ల వరకు పంపవచ్చును

✦ A4 సైజులో **300** dpi లో jpg / jpeg ఫైల్ ఫార్మాట్‌లో కలర్‌లోగానీ/ బ్లాక్ అండ్ వైట్‌లో గానీ వేసి పంపాలి.

✦ మీకు నచ్చిన సబ్జెక్టుపై వినూత్నంగా వేసిన నవ్వించే కార్టూన్లను మాత్రమే పంపండి. కేప్షన్ లెస్ కార్టూన్లకు ప్రాధాన్యత ఉంటుంది.

✦ మీ కార్టూన్లను **31-1-2025 తేదీలోగా** ఈ క్రింది ఈ మెయిల్ కు పంపవలెను.

**nccfvisakhapatnam@gmail.com**

✦ బహుమతి పొందిన 10 కార్టూన్లు మార్చి2025 హాస్యానందం సంచికలో ప్రచురించబడతాయి.

✦ ఈ పోటీలు హాస్యానందం వారి సౌజన్యంతో నిర్వహించ బడుతుంది.

✦ ఇతర వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

**టి ఆర్ బాబు- 9440561425**

**లాల్- 9247783307**

# 30 వేల రూపాయల బహుమతులు

## 10 కథలు 20 కార్టూన్లు

## ఒకోదానికి 1000 రూపాయలు



### పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీ

'జ్యోతిష విశారద' శ్రీ పాలపర్తి శ్రీకాంత్ శర్మ వారి తల్లిదండ్రుల స్మారకార్థం ఈ మినీ హాస్య కథల పోటీ నిర్వహిస్తున్నారు.

**ఒక్కో కథకి 1000 రూపాయలు చొప్పున 10 బహుమతులు**

కథలు ఎంత చిన్నవైతే అంత ప్రాముఖ్యం. (అచ్చులో అరపేజీ దాటకూడదు) కొసమెరుపు అదిరిపోవాలి! ఇవే నిబంధనలు... ఇవి కచ్చితంగా పాటించండి!... బహుమతి గెలుచుకోండి!

### విశ్వావసు నామ ఉగాది సందర్భంగా నిర్వహిస్తున్న కార్టూన్ల పోటీ

**అంశం:**
**భూమ్మీద మానవులు లేకపోతే?**

మన చేతులారా చేసుకుంటున్న కొన్ని పనుల ప్రభావం వలన జరిగే పరిణామాలకు ఫలితాలను కళ్ళకు కట్టే ప్రయత్నమే ఈ అంశం!

**ఒక్కో కార్టూన్ కి 1000 రూపాయలు చొప్పున 20 బహుమతులు**

కార్టూన్ల పరమావధి నవ్వించడమే! నవ్విస్తూనే, భయ పెట్టకుండా ఈ అంశాన్ని ప్రస్తావించాలి. అంతర్లీనంగా కారణం చెబితే బాగుంటుంది.

ఈ మెయిల్‌కి కథలు పంపవలెను-hasyanandampoteelu@gmail.com

**కథలు, కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ ఫిబ్రవరి-10, 2025**

**బహుమతి ప్రదానోత్సవ వివరాలు హాస్యానందం మార్చి సంచికలో ప్రచురించబడతాయి.**


## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు


**4000 రూపాయల బహుమతులు**

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.











**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.


- మొదటి బహుమతి- **రూ.500/-లు**
- రెండవ బహుమతి- **రూ.300/-లు**
- మూడవ బహుమతి- **రూ.200/-లు**







**కార్టూనిస్ట్ శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝుల యల్లారి**
**బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**




## ప్రతి నెలా బహుమతులే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!




డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*తెలుగు అధ్యాపకుడు, కె.బి.ఎన్ కళాశాల, విజయవాడ*
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

"ఇదిగో మిమ్మల్నే..." అంటూ రత్నం పెట్టిన పొలికేకకి దడుపు జ్వరం వచ్చినంత పనైంది.

బడికి సెలవు కదా అని, దినపత్రిక చదివాక అలా వాలుకుర్చీలోనే కాస్తంత కునుకు తీస్తున్న నాకు ఆ పిలుపు యుద్ధభేరీని తలపించింది.

హిమగిరి సొగసులు... అంటూ నిద్రలో హిమాలయాల దాకా వెళ్ళి, విహరిస్తున్న నేను రెప్పపాటు కాలంలో ఈ లోకంలోకి వచ్చేసాను.

అసలు భార్య పిలుపులోనే ఆ మహత్తు ఉందండీ. నా వివాహం నాటి ముచ్చట. జీల కర్ర బెల్లం పెట్టిన సందర్భం అది. వధూవరులం ఇంకా ఒకరి చేతులు ఒకరి శిరస్సు మీద పెట్టే ఉంచాం. పెద్దలంతా అక్షతలు వేసి ఆశీర్వదిస్తూ ఉన్నారు. నెత్తిన అక్షతల వర్షం కురుస్తోంది. అక్షతలు ఎవరు వేస్తున్నారో తర్వాత వీడియోలో చూస్తే కానీ తెలియని పరిస్థితి.

ఇంతలో ఆకాశవాణి వినపడినట్లు ఓ స్వరం వినిపించింది. 'నాన్నా... తలెత్తుకునే పరిస్థితిలో నువ్వు లేవని నాకు తెలుసు. నన్ను మల్లికార్జునరావు అంటారు. మీ దంపతులకు ఆశీస్సులు నాన్నా' అంటూ అక్షతలు వేసి వెళ్ళిపోయాడాయన.

ఆయన మా తెలుగు మాస్టారు. నాకు ఆయనంటే ఎంతో ఇష్టం. మాస్టారు వచ్చినందుకు ఎంతో ఆనందించాను. ఆ వేడుక అలా గడిచిపోయింది. సీన్ కట్ చేస్తే...


వివాహమై నెలలు గడుస్తున్న కొద్దీ మాస్టారి ఆశీర్వచనం గుర్తుకు రావటం మొదలైంది.

ఆ రోజున ఆయన నన్ను ఆశీర్వదించారా? వ్యంగ్యంగా అన్నారా? ఇంకేమైనా సూచన చేసారా? ఆ రోజున ఏమీ అర్థం కాలేదు కానీ... ఇప్పుడిప్పుడే మాస్టారి మాటలకు అర్థం బోధపడుతోంది.

'తలెత్తుకునే పరిస్థితిలో నువ్వులేవు' అంటే ఒకరి చేతులు మరొకరి తల మీద ఉన్నాయి కాబట్టి అనుకోవాలా? ఇక మీదట నీ పరిస్థితి అదే అని భవిష్యత్తు గురించి సూచన చేసారా?... బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తుల మాదిరిగా ఆ ఒక్క వాక్యానికి ఎన్ని వ్యాఖ్యానాలు రాయవచ్చో. ఇంకా ఎన్నో ఆలోచనలు....

"ఇదిగో మిమ్మల్నే... పిలిచి పిలిచీ నోరు నెప్పెడుతోంది తప్ప మనిషి ఉలకరూ పలకరూ..." అంటూ రత్నం నా వైపే వస్తోంది.

"ఇదిగో వస్తున్నానే... అంటూ కుర్చీలోంచి లేచే ప్రయత్నం చేస్తున్నా.





"ఏం అక్కర్లేదు!" అంటూ నన్ను కూలదోసి, తను పక్కనే చతికిల పడింది.

"మా తమ్ముడు... అదేనండీ మా అనంతవరం పిన్ని కొడుకు ఆదిత్య... ఉదయాన్నే ఫోన్ చేసాడు. వాడి కూతురు వివాహం అనుకున్నారు కదా. తాంబూలాలు పుచ్చుకునే కార్యక్రమం మన ఊళ్ళోనే పెట్టుకుంటారట. పల్లెటూరు కదా. ఇక్కడ సౌకర్యాలు అంతగా ఉండవు అక్కా. మీది పట్టణం కాబట్టి అన్నీ దొరుకుతాయి. వియ్యాల వారు కూడా సంతోషపడతారు... కాస్త నీ సాయం కావాలక్కా!" అన్నాడు.

"దానిదేముందిరా... చిన్నారి నాకు మేన కోడలైనా కూతురుతో సమానం. అన్నీ నేను చూసుకుంటా!" అని భరోసా ఇచ్చా.

"కళ్యాణమంటపం మాట్లాడమన్నాడు కానీ ఎందుకూ... అటు ఇటూ కలిపి మహా అయితే ఓ యాభైమంది అవుతారు. అందుకని మనింట్లోనే పెట్టేసుకుందాం. మీకు ఒత్తిడి కలిగించకుండా నేనే కావాల్సిన సామాగ్రి లిస్ట్ కూడా రాశాను. వీశెడు పులిహొర, దద్దోజనం చేయిస్తా. వాకిట్లో వుయ్యాల బల్ల పెట్టించండి. బాగుంటుంది. మా బందరు పెద్దమ్మ కోడలు బాలింతరాలు. దానికి మన గది ఇస్తాను. మీరేమంటారు?"... అంటూ మాటల జడివాన కురిపించింది రత్నం.





"మంచి మాట చెప్పావు రత్నం. చిన్నారి కూడా మనమంటే ప్రేమగా ఉంటుంది... అలాగే చేద్దాం. కానీ, ఒక్క మాట చెప్పనా?" అనగానే..."చెప్పండి!" అంటూ రత్నం ఎంతో ఆత్రంగా ముందుకు వచ్చింది.

"ఇక, కళ్యాణమంటపం విషయానికొస్తే, దాన్ని ఏర్పాటుచేయడం నీకు... ఈ జన్మలో సాధ్యం కాదు. ఎందుకంటే **కళ్యాణమంటపం** అనకూడదు. **కల్యాణమండపం** అనాలి... కల్యాణం అనేది సంస్కృత పదం. సంస్కృతంలో 'ళ' లేదు కాబట్టి కల్యాణ అని మాత్రమే రాయాలి. అలాగే పలకాలి కూడా. ఇక, **మంటపం** అనకూడదు. **మండపం** అనాలి. అలాగే రాయాలి కూడా!"

"నువ్వు సామాగ్రి లిస్ట్ రాశాను అన్నావు కదా! నీ జన్మలో ఈ లిస్ట్ రాయలేవు. ఎందుకంటే ఇందులో కూడా రెండు తప్పులున్నాయి. **సామాగ్రి** అనకూడదు. **సామగ్రి** అనాలి... ఇలాంటిదే **సాంప్రదాయం** అనే పదం కూడా. **సంప్రదాయం** అనే రాయాలి. అలాగే పలకాలి. అనవసరంగా ఈ పదాలకు దీర్ఘాలు ఇవ్వడం వల్ల అర్థలోపం వస్తుంది... ఇక, **రాశాను** అనటం కూడా తప్పే. **రాసాను** అనాలి. ఎందుకంటే, రాశాను అనే పదం సరైనది అనుకుంటే, దాని అసమాపక క్రియలో రాశి అని రాయాలి. కానీ మనం రాసి అని రాస్తాం... కాబట్టి, రాసాను అని మాత్రమే రాయాలి. అలాగే పలకాలి కూడా.

**వీశెడు** అనే పదం కూడా తప్పే. **వీసెడు** అనాలి. అలాగే రాయాలి.




నీకు ఎంత ఇష్టమైనప్పటికీ **పులిహోర** అనకూడదు... **పులిహోర** అని మాత్రమే రాయాలి. అలాగే పలకాలి. **దద్ధోజనం** అని రాయకూడదు. పలక కూడదు. దధి ప్లస్ ఉదనము **దధ్యోదనము** అవుతుంది తప్ప దద్ధోజనం కాదు.

ఇక, వాకిట్లో నేను వుయ్యాల బల్ల పెట్టించలేను. ఎందుకంటే, **వుయ్యాల** అనే పదం తప్పు. **ఊయెల, ఊయేల** అనవచ్చు. కాబట్టి, నేను ఊయెల బల్ల పెట్టిస్తాను. ఇక, పెద్దమ్మ కోడలు విషయానికొస్తే, ఆమె **బాలింతరాలు** కాదు. **బాలెంతరాలు** అనాలి. బాలింత అనే పదం తప్పు!" అంటుండగా....

"ఓరి దేముడో!... ఇదెక్కడి ఘటం రా నాయనా. మాట మాట్లాడితే దీర్ఘం, పొల్లులు, అచ్చులు అంటూ వ్యాకరణం మొదలుపెడతాడు. అయినా, ఇన్నేళ్ళు గడిచాక ఇప్పుడనుకుని ఏం లాభం. మా నాన్న చేసిన తప్పుకి నేను శిక్ష అనుభవిస్తున్నాను. నిక్షేపంలాంటి బెంగళూరు సాఫ్ట్‌వేర్ సంబంధం కాదని మా నాన్న... తెలుగు మాస్టారికిచ్చి నా గొంతు కోసాడు. ఈ పెద్దమనిషిని బదులు వ్యాకరణం పుస్తకాన్ని కట్టుకుంటే సరిపోయేది..." అంటూ రత్నం నిట్టూర్పు విడిచింది.

"అలా కాదు రత్నం..." అంటూ ఏదో చెప్పబోతుండగా వంటిట్లో గిన్నెలు విసిరికొడుతున్న శబ్దం గట్టిగా వినిపించడంతో వాలు కుర్చీ నుంచి వాకిట్లోకి పరుగుతీసా. **(సశేషం)**





## డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి) ఆశీస్సులతో
## శ్రీ గుదిబండి వెంకట రెడ్డి గారు,
## హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన
# కార్టూన్ పోటీ ఫలితాలు


డా॥ కె.వి.రమణగారి 73వ పుట్టినరోజు సందర్భంగా శ్రీ గుదిబండి వెంకటరెడ్డిగారు హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్టూన్ పోటీకి సుమారు 280 కార్టూన్లు వచ్చాయి. వాటిలోంచి 10 కార్టూన్లను ఎంపిక చేయడం జరిగింది. పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న కార్టూనిస్టులకు అభినందనలు. ప్రతియేడు రమణగారి పుట్టినరోజుని పురస్కరించుకుని నిర్వహించే ఈ పోటీలో బహుమతులు గత యేడాది వరకు వెయ్యి రూపాయలు ఉండేది. ఈ సంవత్సరం నుంచి ఈ పారితోషికం మూడు వేలకు పెంచడం జరిగింది. ఈ బహుమతి ప్రదానోత్సవ సభ హైదరాబాద్, శ్రీ త్యాగరాయగాన సభలో, ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహించడం జరుగుతుంది. విజేతలందరూ రావాలని కోరుకుంటూ... కార్టూనిస్టు మిత్రులందరూ ఈ సభలో పాల్గోవాలని కోరుతున్నాము.


–ఎడిటర్


## ఒకో కార్టూన్‌కి 3000 రూపాయలు చొప్పున 10 బహుమతులు






















# ఆహ్వానము

**డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి) ఆశీస్సులతో**
**శ్రీ గుదిబండి వెంకట రెడ్డిగారు, హాస్యానందం సౌజన్యంతో**
**నిర్వహించిన కార్టూన్ పోటీలో విజేతలకు**
**బహుమతి ప్రదానోత్సవం!**

**12-02-2025, బుధవారం**
**సాయంకాలం 6 గంటలకు**

**వేదిక:**
**త్యాగరాయగాన సభ, చిక్కడపల్లి, హైదరాబాద్**




కథ-కథనం

**యండమూరి వీరేంద్రనాథ్**

**యర్రంశెట్టి శాయి**



# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండో వాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! బ్యాంకులో పని. సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. ఒకరోజు సాత్వికరావు, రాధ బస్టాప్‌లో కలుస్తారు. **ఆ తర్వాత...**

**"బాగా ముసురు పట్టింది. ఇప్పట్లో తగ్గేట్లు లేదు." ఆకాశం వైపు చూస్తూ స్వగతంగా అన్నాడు.**

**రాధ కలవరపాటుతో...**

**"అయ్యో! ఇప్పుడెలా? అవతల హోటల్లో మునెయ్య ఒక్కడే ఎదురు చూస్తూ ఉంటాడు." అంది.**

**"అర్జెంట్‌గా వెళ్ళాలా? లాడ్జిలో కస్టమరు ఎవరైనా ఉన్నారా?" అన్నాడు.**

**అతడు సహృదయంతో అడిగిన ఆ ప్రశ్న ఆమెకి కరెక్ట్‌గా అర్థమయి ఉంటే అంత వర్షంలోనూ అక్కడో అగ్నిపర్వతం బద్దలయ్యేదే. అయితే అతడు ఆ ప్రశ్న మామూలుగానే అడిగాడనుకుని... "అది నా హోటల్! మునెయ్య నా వంటవాడు." అంది.**

"ఓహో! మీరు హోటల్ ప్రొప్రయిటరా అండీ?" అని అడిగాడు.

"అవును!"

"హోటల్‌కి లేడీ ప్రొప్రయిటరంటే చాలా తమాషాగా ఉందే!"

"ఇందులో తమాషా ఏముంది? అదేం ఆడాళ్ళకు చేత కాని విద్యా ఏమిటి? నీకు తెలుసో తెలీదో నేను తీసుకున్న బ్యాంక్‌లోను మొదటి సంవత్సరంలోనే సగం తీర్చేశాను!" గర్వంగా అన్నది.

"గ్రేట్!" అన్నాడు.

వాళ్ళ పోకడ చూసి ఇంద్రసతి ముఖం వాడిపోయింది.

"ఇదేదో కొంప మీదకొచ్చేటట్లు ఉంది....వర్షం వెలిసే లోపలే ఇద్దరూ ఒకటైపోయేటట్లున్నారు." అంది గాభరాగా.

"అవునవును! భూలోకంలో ఈ వర్షాలింతే. చాలా ప్రమాదకరమైనవి... బట్టలూ, వళ్ళూ ఒక్కటై పోతాయి. వానదేవుడితో మాట్లాడతాను!" అన్నాడు తడబడుతూ.

"మీరూ వానదేవుడూ తరువాత మాట్లాడుకుందురు గానీ ముందు ఈ జంటని విడగొట్టండి" అంటూ ఉండగా ఆమెకు హఠాత్తుగా ఒక ఐడియా తట్టింది.

వెంటనే రెండు గొడుగులు సృష్టించి ఒకటి తను వేసు కొని, మరోటి రాధకి కనపడేలా పట్టుకొని రేకుల షెడ్ ముందు నుంచి నడవసాగింది.

"హలో మేడం! వన్ మినిట్... నేనూ మీ గొడుగులో వస్తాను!" అంది రాధ.

"ఓః! రామ్మా! నా గొడుగు ఎందుకు? మరొకటి ఉంది. ఇదిగో తీసుకో!" అని నవ్వుకుంటూ అందించింది.

ఇద్దరూ చెరో గొడుగులో వెళ్ళిపోవటం చూస్తూనే రతీ దేవికి కోపం ముంచుకు వచ్చింది.

"చూశారా! చూశారా... ఆ ఇంద్రసతి ఎలా చెడ గొడ్తోందో..." అంది ఉక్రోషంగా.

"ఆడాళ్ళ మనస్తత్వం ఇలాగే ఉంటుంది దేవీ... తోటి ఆడదాన్ని హింసించటమే వాళ్ళ ఆనందం!" అంటూ ఉండగా... ఏదో ఆలోచన తట్టినట్టు ఆనందంతో అతని ముఖం వెలిగిపోయింది.

"రెండు సినిమా టిక్కెట్లు. పక్క పక్కన!" అన్నాడు.

✦✦✦

సినిమా హాల్లో కూర్చుని ఉన్నాడు సాత్విక్.

సిగరెట్ తాగటం వల్ల వచ్చే కాన్సర్ మీద డాక్యుమెంటరీ చూస్తుండగా అతడికి రాధ గుర్తొచ్చింది.

కళ్ళు మూసుకున్నాడు. పెళ్ళికూతురి గెటప్‌లో రాధ మరింత అందంగా కనిపించింది. పెళ్ళికొడుకు తను కాదు. ఇంకెవడో..!

ఆమెకు పెళ్లి అయిపోవటం, ఆమెని మర్చిపోలేక తను డ్రగ్స్‌కి అలవాటు పడి ('తాగుడు' పాత కథ), సమాధి పక్కన కూర్చుని... డ్రగ్‌కి డబ్బు లేక 'మేడ పైన అల పైడి బొమ్మా' అని పాడుతూ మరణించ బోతూంటే, ఆ విషయం తెలిసి పెళ్లి పీటల మీద నుంచి లేచి పరుగెత్తుకు వచ్చిన పార్వతి... సారీ రాధ... తనని వళ్ళోకి తీసుకుని ఆమె కూడా సమాధిలోనే పడి మరణించటం... తుఫాను గాలికి మట్టి పడి గుంటలో ఇద్దర్నీ భూమిలో ఒకటిగా కప్పెట్టటం... 'మరణానికి డెత్ లేదు' అని అశుభం కార్డు పడటం...

'ఛ!... కలలుకనటం కూడా నాకు సరీగ్గా రాదు... రాధతో పెళ్లి అయినట్టు ఊహించుకోవచ్చు కదా! ఇద్దరూ చచ్చినట్టు ఏవింటి? అందులోనూ 'సమాధిలో' చావటం... మరణానికి 'డెత్' ఏమిటి? దానికన్నా దరిద్రంగా, చివర్లో ఆ 'అ'శుభం కార్డు ఏవింటి? మరణానికి డెత్ ఏవింటి?' అంటూ తనని తానే తిట్టుకున్నాడు.

సరిగ్గా అప్పుడే ఓ యువతి వచ్చి అతని పక్కన కుర్చీలో కూర్చోవటం గమనించాడు.

మెయిన్ సినిమా మొదలవబోతుండగా ఇద్దరూ మొహాలు చూసుకుని, అలాగే ఫ్రీజ్ అయిపోయారు.

"నిజం చెప్పు! ఇదంతా కావాలని చేస్తున్నావు కదూ?" కోపంగా అంది రాధ.

"ఇది మళ్ళీ కొత్త అభియోగమా? కావాలని చేయటం ఏమిటి?"

"ఇదే... నేనెక్కడికెళ్తే అక్కడ ఇలా రోజంతా ప్రత్యక్షమవటం."

"హాల్లో సినిమా చూడటానికి ముందు వచ్చింది నేను... నీ మీద నేనూ ఆ నింద వేస్తే నువ్వేమంటావు?"

రాధ ఆలోచనలో పడింది.


ఇంత కాకతాళీయంగా ఇద్దరూ ఇన్నిసార్లు ఎలా కలుసుకుంటున్నారని ఆమెకూ ఆశ్చర్యంగానే ఉంది. ఇలాంటివి కేవలం సినిమాల్లోనే జరుగుతూ ఉంటాయి కదా!

సినిమా మొదలయింది.

హీరో హీరోయిన్లు సైకిళ్ళ మీద ఎదురెదురుగా వచ్చి డ్యాష్ ఇచ్చుకుని పడిపోయారు. ఇద్దరూ సారీ చెప్పుకుని లేచి నిలబడ్డారు. కిందపడిన హీరోయిన్ పుస్తకాలు తీయటానికి మళ్ళీ ఇద్దరూ ఒకేసారి వంగారు. ఇద్దరి తలలూ ఢీకొన్నాయి. మళ్ళీ ఇద్దరూ సిగ్గుపడి సారీ చెప్పుకొని, పొరబాటున ఒకరి పుస్తకాలు ఒకరు తీసుకొని ఎవరి దారిన వాళ్ళు వెళ్ళబోయారు.

ఆమె చీర చెంగు అతని కోటు బటన్‌కి పట్టుకుంది. మళ్ళీ 'సారీ' చెప్పుకుని, ప్రేమగా చూసుకుని విడిపోయారు. కాలేజ్‌లో క్లాస్‌రూంలో మళ్ళీ ఇద్దరూ ఢీ కొన్నారు. ఆ పై 'సారీ' చెప్పుకొని పుస్తకాలు మార్చుకున్నారు. సినిమా పేరు "సారీ"






సాత్వికరావుకి చిరాకు పుట్టింది.

"ట్రాష్!... అంతా అన్యాచురల్!" అన్నాడు స్వగతంగా.

"సినిమా పేరు చూడు. శారీ. చీరే ప్రేమికుల్ని కలిపింది... న్యాచురల్" అంది రాధ.

"సినిమా పేరు శారీ కాదు. 'సారీ'. అయినా ఇది ఎలా న్యాచురల్?"

"ఎలాగేమిటి? ఇవాళ మనం ఎన్నిసార్లు కలుసుకున్నాం?... అదంతా అన్-న్యాచ్యురలేనా?"

సాత్వికరావు మాట్లాడలేదు.

ఈలోగా హీరో హీరోయిన్లు కోతుల్లా కరుచుకుపోయి డ్యాన్స్ చేయసాగారు.

"ట్రాష్!" అన్నాడు సాత్వికరావు మళ్ళీ.

"ఏమిటి ట్రాష్?"

"ఒక్కరోజు పరిచయంతో అలా గెంతుతారేమిటి?"

"ప్రేమ ఏర్పడటానికి ఒక్క క్షణం చాలు."

"నేన్నమ్మను!"

"నేను నమ్ముతాను!"

"ఎలా నమ్ముతావ్?"

"పది నెలల క్రితం మా ఫ్రెండ్ కనకతార ఒకతన్ని బస్‌స్టాప్‌లో అలాగే చూసి, బస్ రాడ్ ఎవరు పట్టుకోవాలన్న విషయంలో గొడవ పెట్టుకుని, బస్ కుదుపులకి ఆవిడ తూలి పడబోతూంటే అతను ఆమెని పట్టుకుని... అలా బస్సులోనే ఒకర్నొకరు ఆకట్టుకుని... బస్ దిగి అట్నుంచి ఆటే ఒకరి చేతుల్లో ఒకరు చేతులు పెట్టుకుని, రిజిస్టార్ ఆఫీసుకి వెళ్లి పెళ్ళి చేసుకున్నారు. బస్! తొమ్మిదో నెల్లోనే తల్లయింది".

"నేన్నమ్మను!" అన్నాడు.

"రేపు వాళ్ళింటికి తీసుకెళ్తాను... అక్కడ పాపాయిని ఎత్తుకో. అప్పుడు నమ్మకం కలుగుతుంది!" నవ్వాపుకుంటూ అంది.

రిజర్వ్‌డ్ క్లాసులోనుంచి వాళ్ళిద్దరినీ కనిపెడుతున్న ఇంద్రసతి, భర్తచెయ్యి గట్టిగా గిల్లి,

"అటు చూడండి! వాళ్ళిద్దరూ ప్రేమలో పడిపోతున్నారు. ఇప్పుడెలా?..." అని గాభరాగా అడిగింది.

"దానిదేముంది. కరెంటు పోగొడితే సరి!" అన్నాడు ఇంద్రుడు తెలివిగా.

ఇంద్రసతి అసహనంగా చూసి... "కరెంటు పోతే భూలోకవాసులు జెనరేటర్ ఉపయోగిస్తారన్న ఇంగితజ్ఞానం కూడా లేకపోతే ఎలా?" అంది.

ఇంద్రుడు మళ్ళీ ఆలోచించి.

"సరే. ఓ పని చెయ్. ఓ దేశనాయకుడిని పైకి పంపించెయ్.దెబ్బతో అన్నీ మూసేస్తారు!" అన్నాడు.


ఆ ఆలోచన శచీదేవికి ఎంతో నచ్చింది.

మరుక్షణం... ఓ దేశనాయకుడు గుండెపోటుతో హఠాత్తుగా ఎగిరిపోయాడు. ఆ వార్త దేశమంతా పాకి, ప్రజలకి నిత్యావసరాలైన మెడికల్ షాపులూ, గుళ్ళూ... అన్నీ క్షణాల్లో మూసేశారు. విస్కీ షాపులూ, సినిమా హాళ్ళూ మాత్రం మూయలేదు.

"అయ్యో! ఇదెక్కడి దేశమండీ. దేశమంతా బంద్ అయినా సినిమాలూ బార్లూ మాత్రం ఆపలేదు!" అంది.

"ఓ పాముని తెచ్చి హాలు మధ్యలో పడెయ్!" అన్నాడు ఇంద్రుడు.

ఇంద్రసతికి ఆ ఆలోచన నచ్చి... మొహం



ఆనందంతో పొంగిపోయింది.

పాతాళరాజుని ప్రార్థించి ఓ పాముని తెచ్చి జనం మధ్యకు విసిరింది... రెండు నిముషాల్లో హాలు ఖాళీ అయింది.


సాత్వికరావు, రాధ ఆ తొక్కిసలాటలో చెరో దారీ అయిపోయారు.

అది చూసిన రతీదేవి కోపంతో పళ్ళు కొరికింది.

మన్మథుడు ఆమెని ఓదారుస్తూ, "ఇలాంటి పట్టుదల వచ్చినప్పుడే ఎత్తుకి పైఎత్తు వెయ్యాలి!" అన్నాడు.

ఆమె కొద్ది క్షణాలు ఆలోచించి–

"ఆ ఇద్దరినీ కలిపే అద్భుతమైన ఉపాయం దొరికింది!" అన్నది.




"ఏమిటది?" అడిగాడు.

"నగరంలో పెద్ద వరద తెప్పిస్తాను. ప్రజలంతా పరుగులు పెడతారు. సాత్వికరావు వెళ్ళి రాధ మేడ మీదకు వెళ్లి ఆమె మెడలో తల దాచుకుంటాడు... ఇద్దరూ అక్కడే... దేవుడి క్యాలెండరు ముందు దండలు మార్చుకుని ఒకటై పోతారు!"

"అమృతం తాగితే ఉన్న మతి పోయిందన్నట్టు ఉంది నీ ఆలోచన. వాళ్ళని కలపటం కోసం వరదలు తెప్పిస్తే బోలెడు జననష్టం జరుగుతుంది... మరోలా చెప్పాలంటే జనం నుదుటన బ్రహ్మ వ్రాసిన రాతే మారిపోతుందన్న మాట. ఇద్దరి కోసం పదుగురి తలరాతలు మారుస్తావా?"

రతీదేవి నాలుకర్చుకుని–

"మరేం చేయమంటారో చెప్పండి!" అంది.

"నన్నడిగితే నా దగ్గరో ఉపాయం ఉంది."

"చెప్పండి! ఇందాకటి నుంచీ చెప్పరేం?"

"రాధను నిర్మానుష్యమయిన ఓ రోడ్డు మీద నడిచేలా చేయి. నేను ఓ పెద్ద రౌడీలా వెళ్ళి బలాత్కారం చేయబోతాను. అప్పుడు సాత్వికరావు వచ్చి నన్ను చితక్కొట్టి ఆమెను రక్షిస్తాడు. దాంతో ఇద్దరూ పెళ్ళి చేసుకోవటానికి నిర్ణయించుకుంటారు. ఎలా ఉంది ఈ ఆలోచన?.

"మరీ ఇంత పాత చింతకాయ పచ్చడి ఆలోచన ఎవరయినా వింటే నవ్వుకుంటారు".

మన్మథునికి పౌరుషం పొడుచుకు వచ్చింది.

"బ్రహ్మ తమ్ముణ్ణి నేను!... మా అన్నయ్య భక్తులు బ్రహ్మణే బ్రహ్మవిజ్ఞాన దుగ్ధోదధి విధాయినే. బ్రహ్మతత్త్వ దిదృక్షూణాం బ్రహ్మదాయ నమో నమః...' అని ప్రార్థిస్తారే. అలాంటిది నా ఉపాయాల్నే కాదంటావా..."

"అయినా సరే! మీ ఉపాయం నాకొద్దు లెండి. ఏకాంతంలో వాళ్ళిద్దరూ కలుసుకునేటట్లు ఏర్పాటు చేస్తే చాలు. మిగతా విషయాలన్నీ వాళ్ళే మాట్లాడుకుంటారు."


"అయితే మరింకేం. అలాగే కానీ. వాళ్ళు కలిసిన తరువాతే నా ఉపాయం ఉపయోగిద్దాం!" అన్నాడు.


రతీదేవి భర్త వైపు అనుమానంగా చూస్తూ, "మాట్లాడితే 'ఉపాయం... ఉపాయం' అని తెగ ఇదవుతున్నారు. ఏమిటి సంగతి? బలాత్కారం చేసే వంకతో ఆ అమ్మాయిని..." అనబోతూంటే...

"శివశివా! మానవకన్యతో సంబంధం అంట కడతావా? ఎంత పాపం!... ఆ సంగతి సరే. జరగవలసిన విషయం ఆలోచించు. నేను రాధ హోటల్ దగ్గరకి వెళ్తున్నాను" అంటూ ఆకాశం నుంచి క్రిందికి గెంతాడు మన్మథుడు.

✦✦✦

రాధ ఒక్కతే రోడ్డు మీద వెళుతోంది.






సాత్విక్ ఆమె వెనక కొంతదూరంలో నడుస్తున్నాడు. ముందున్నది రాధ అని అతడికి తెలీదు.

రతీదేవి మాయ వల్ల రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

తలవంచుకొని నడుస్తున్న రాధ ముందు అకస్మాత్తుగా ఒక భయంకరాకారం గాలిలోంచి పైకి లేచి పెద్ద శబ్దంతో ముందుకి దూకి, టెర్మినేటర్-2 సినిమాలోలా గిరజాల జుట్టు, టైట్ ప్యాంటు, బుగ్గ మీద గాటుతో రౌడీలా మారింది.

అది చూసి రాధ కెవ్వున కేక వేసింది.

బుగ్గగాటు విలన్ రాధను ముందుకు వెళ్ళనివ్వకుండా రెండు చేతులూ సాచి,

"అహ్హహ్హహ్హ... నా పేరు మన్మథసింగ్! మర్యాదగా పక్క తుప్పల్లోకి వస్తావా? బలవంతంగా తీసుకెళ్లమంటావా?" అని అడిగాడు.

సమాధానం చెప్పాలన్న స్పృహ కూడా లేకుండా రాధ బిక్క చచ్చిపోయి... బిత్తర చూపులు చూస్తూ ఉండిపోయింది.

ఆమె వెనుకే దూరంగా, అతి నెమ్మదిగా నడుస్తూన్న సాత్విక్ ఇంకా దగ్గరికి రాకపోవడంతో, మన్మథసింగ్‌కి ఏం చేయాలో తెలియ లేదు. తను కూడా మౌనంగా ఉండిపోయాడు.

ఇదంతా దూరం నుంచి చూస్తున్న రతీదేవి తలబాదుకుంది.

రాధకి స్పృహ తప్పటం ఒక్కటే తక్కువ.

ఈ లోపులో సాత్విక్ వాళ్ల దగ్గరికి వచ్చాడు.

అతడిని గమనించి మన్మథసింగ్... రాధ భుజం మీద చేయి వేసి దగ్గరికి లాక్కోబోయాడు. తరువాతి సీను రతీదేవి ఊహించుకుంది.

"వదర్రా! ఆ అమ్మాయిని వదులు!..." అంటూ సాత్విక్ మన్మథసింగ్ చేయి పట్టుకున్నాడు. ఆ రౌడీ సాత్విక్ ని బలంగా వెనక్కి తోసాడు.

అంతే...! సాత్విక్ స్లోమోషన్ లో పిడికిలి బిగించి కొట్టిన దెబ్బకి సింగ్ క్రింద పడిపోయాడు.

చేతులు దులుపుకుంటూ తన దగ్గరకి వచ్చిన హీరోని చూసి... 'ఐ లవ్యూ సాత్విక్' అంది రాధ.

నడిరోడ్డు కంపించేలా ఇద్దరూ ముద్దు పెట్టుకున్నారు.

ఆ చప్పుడుకి ఊహల్లోంచి తెప్పరిల్లి వాస్తవంలోకి వచ్చి చూస్తే, సాత్విక్ ఆ రౌడీని...

"వదిలేయండి సార్. మిట్ట మధ్యాహ్నం నడిబజార్లో ఈ విధంగా రేప్ చేయకూడదు" అంటూ బతిమాలుతున్నాడు.

"అంటే రాత్రిపూట అడవిలో చేయొచ్చా?" అడిగాడు మన్మథ సింగ్.

"ఎక్కడా చెయ్యకూడదు. పవిత్ర గంగా గోదావరీ నదులు పుట్టిన దేశం సార్ మనది!" అన్నాడు సాత్విక్.

"అంటే నీరు లేని ఎడారిలో చెయ్యొచ్చా?"

రతీదేవి మళ్ళీ తల బాదుకుంది.


బలవంతం చేయమని పంపిస్తే 'బలాత్కారం చేయటానికి తగిన ప్రదేశాలు ఏమిటి' అని ఇద్దరు తీరిగ్గా చర్చించుకుంటున్నారు.

"వద్దు! వద్దు!!" అంటూ కాళ్లు పట్టుకున్నాడు సాత్వికుడు.

'ఇదేదో గజేంద్రమోక్షం సీనులా ఉంది' అని విసుక్కుంది రతీదేవి.

"కాళ్ళు వదులు. కావాలంటే నన్ను కొట్టు. నేను పారిపోయేలా కొట్టు. కాళ్ళు వదిలి పిడికిలి బిగించు!" హింట్ ఇచ్చాడు మరుడు.

"వదలను సార్. వదలను. మీకు తల్లి, పినతల్లి ఎవరూ లేరా? మీ అక్క చెల్లెళ్ళని ఎవరైనా ఇలాగే చేస్తే మీకెలా ఉంటుంది?" అన్నాడు నరుడు. **(సశేషం)**






**తెలుగువాడు ఇంగ్లీష్‌తో సంకరం చెంది, అభివృద్ధి అందిపుచ్చుకున్నాననుకోవడం ఏదయితే వుందో అది చూసారూ!... దానినే 'దౌర్భాగ్యం' అనాలేమో!**

**నిజానికి మన తరతరాల అపార జ్ఞాన సంపదనంతా కొల్లగొట్టి... వాళ్ళు మనకు గుమస్తా చదువులు అంటగట్టి, ఆఖరికి 'దే'ల సంస్కృతి వైపు- దేకిస్తున్నారు. 'ఈ' తరం దాన్నే గొప్పగా ఫీలయిపోతూ... అవి పాటించడమే, డాలర్ల వేటలో జాలర్లలా సముద్రాలు దాటి... మనమే చేపల్లా చేవ చచ్చి వాళ్ళకి 'ఎర' అయి పోతున్నాం అని మరచిపోతున్నారు.**

మదర్స్‌డే, ఫాదర్స్‌డే, ఫ్యామిలీడే అంటూ శాశ్వత విలువలు వదిలి, కేవలం 'దినాలనే' ఉత్సవాలుగా పరిగణించి పాటించేస్తున్నారు మనవాళ్ళు!

ఇప్పుడు ఇదిగో...ఈ ఫిబ్రవరిలో 'వాలం టైన్స్‌డే' అనేది ప్రేమికుల దినోత్సవంగా... ముఖ్యంగా యువతను గంగవెర్రులెత్తిస్తుంది!

దిల్‌షేప్‌వాలీ బెలూన్స్, హార్ట్‌షేప్ చాక్‌లెట్లు, పార్కుషికార్లు, రాత్రికి పబ్‌లూ, క్లబ్‌లూ హోరెత్తి పోతాయి.

'వాలం' అంటే తెలుగులో అర్థం 'తోక'. 'టై' అంటే మెడకు కట్టుకునేది.

ఇంగ్లీష్‌లో సంకరం వల్ల మన తోకలు 'టై' లుగా స్టైల్‌గా మెడలో వేలాడేసుకునే దొరల కల్చర్‌కు ఈ వాలంటైన్స్ డే కూడా ఓ ప్రతీకే మరి! వట్టి 'కోతి' సంస్కృతి!

ప్రేమించు ప్రేమకై...ప్రేమించు ముక్తికై అన్నది మన సిద్ధాంతం!

"ప్రేమ యిచ్చిన ప్రేమ వచ్చును" అన్నది మన నమ్మిక.

"వలపెరుంగక కులికి మురిసేకంటే
వలచి విఫలమ్మొంది విలపింపమేలురా!"

అన్నాడు మన కవి.

మన భారతీయులలో 'ప్రేమ' చాలా ఉదాత్త మైంది. అది 'దే'లకూ 'డేటింగ్'లకూ పరి మితం కాదు... ప్రేమను మనం సరుకుగా భావించం. ప్రేమ పరిణయంగా పర్యవసానం చెందాలనీ, ఒకవేళ విఫలమైతే-త్యాగం చేసి మిన్నకుండాలనీ మనవాళ్ళు చెప్పారు గానీ, అమ్మాయి ప్రేమించలేదని యాసిడ్ పోయ డాలూ, కత్తితో పొడవడాలూ మన సంస్కృతి కాదు. మహా అయితే మనకు 'దేవదాసు'లు కొత్తకాదు. విరహగీతాలు మన పేటెంట్ హక్కు!


పార్కులో ప్రేమికుల జంట కనిపిస్తే ఏదో 'దళం' వారు ఆ జంటకు పెళ్ళి చేస్తున్నారని ఓ 'గోల' కూడా మొదలైంది. పెద్దలు తమ పెళ్ళికి ఒప్పుకోకపోతే ఏ పార్కులోనో అలా 'దళం' వారికి కనిపిస్తే బెస్ట్ అనుకుంటున్నారట కొందరు ప్రేమికులు!

ఆ మధ్య ఇలాగే ఒక వృద్ధ జంట కనపడితే కూడా-"ఇదేంటండీ! మీరూనా?..." అని అడి గితే, ఎప్పుడో చిన్నప్పుడు ప్రేమించుకు విడి పోయామనీ, ఇప్పుడు బాధ్యతలన్నీ తీరి జీవన సహచరులను కోల్పోయి ఒంటరులమయ్యా మనీ, అందుకే మళ్లీ ప్రేమించుకుంటున్నామనీ అన్నారుట. మరి వాళ్ళిద్దరికీ ఆ 'దళ్' వారు పెళ్ళి చేసారో లేదో మాత్రం 'తెల్వద్'!

ఒకప్పుడు 'ప్రేమలేఖ' అంటే గొప్ప విలువ ఉండేది. అది రాయడం ఓ కళ!

అంతే కాదు... తమ ప్రేమను 'కమిట్' చేయడం కూడా అందులో వుండేది. ఇప్పు డలా రాతకోతలు ఏమీ వుండడంలేదు.

'కోతలు' వుంటున్నాయి అంటున్నారా! అవు ననుకోండి!! ఇప్పుడన్నీ ఫోన్ ఛాటింగ్‌లూ, మెసేజ్‌లూనూ. ఇవి డిలీట్ చేసేసే వీలుంది. ప్రేమలేఖ పోస్ట్ చేస్తే... అందిస్తే, ఆ వీలు వుండదు కదా! ప్రేమలో నిజాయితీ, విశ్వాసం ముఖ్యం. ఇప్పుడు వన్‌సైడ్ 'లవ్'లు అయితే - హింసా నేరాల వైపు పరిణమిస్తున్నాయి.




'ప్రేమించానని వచ్చిన శూర్పణఖ ముక్కూ

చెవులూ కోసిన లక్ష్మణుడు లేడా?...' అని ప్రశ్నించేవారు తయారవుతున్నారు. రామాయణంలోని ప్రేమాయణం వాళ్ళు అర్థం చేసుకున్న తీరది మరి!

'వాలంటైన్స్ దే' పుణ్యమా అని వ్యాపారస్తులు బాగా సొమ్ము చేసుకుంటున్నారు.

ఓ కుర్రాడు గ్రీటింగ్ కార్డుల షాప్‌కు వెళ్ళి ఓ మంచి కార్డు సెలక్ట్ చేసుకున్నాడు –

"నా హృదయంలోని ఏకైక ప్రేయసికి...నా జీవితాన్ని గులాబీ చేసి నీ పాదాల ముందు పెడుతున్నాను" అని అందులో రాసి వుందిట!

ఆ కుర్రాడు షాప్ యజమానితో– "ఈ గ్రీటింగ్ కార్డులు ఓ పన్నెండు ఇవ్వండి" అని ఆర్డరిచ్చాడట!

కదిలేదీ కదిలించేదీ...


మారేదీ, మార్పించేదీ...

అన్న శ్రీశ్రీ పంక్తులను కొంతమంది కుర్రవాళ్ళు ప్రేమకు అన్వయం చేస్తున్న భావి యుగం దూతలవుతున్నారు మరి! ఏం చేస్తాం?

ఇప్పుడు ప్రేయసి, ప్రియుడు అనడం లేదు. ముందు బాయ్‌ఫ్రెండ్, గర్ల్‌ఫ్రెండ్ అని మొదలవుతుంది... అది 'ఫియాన్సీ' అనే లెవెల్‌కు 'ఫాన్సీ'గా ఎప్పుడు మారుతుందో కూడా చెప్పలేం సుమండీ!

చిన్నప్పుడు స్కూల్లో పొద్దున్న బడికి వెళ్ళగానే తరగతి గదులకు వెళ్ళేముందు... ప్రార్థన వుండేది.


ఆ తర్వాత "భారతదేశము నా మాతృ




భూమి. భారతీయులందరూ నా సహోదరులు. నా దేశ వారసత్వ సంపద నాకు గర్వ కారణము" అని ప్రతిజ్ఞ వుండేది. అందరూ సహోదరులు అనే మాట నచ్చక 'ఒక్కరు తప్ప' అని మనసులో అనుకునే మహనీయ విద్యార్థులుండే వారనుకోండి!

అసలు అమ్మాయిని అబ్బాయి చెల్లాయి అనో, అబ్బాయిని అమ్మాయి అన్న అనో పిలవాలనే రివాజు ఒకప్పుడు వుండేదేమో గానీ... ఇప్పుడంతా హుళక్కి! 'చెల్లీ' అని పిలుస్తూనే 'లీ' కింద 'లా' వత్తులు తీసేయడం 'లా' అయి కూర్చుంటోంది.

బడి రోజుల్లోనే – 'బాయ్‌ఫ్రెండ్' కల్చరూ అమ్మాయిలకు అలవడుతోంది.




ఓ యువ ప్రేమికుల జంట పార్కులో వున్నప్పుడు ఓ ముష్టివాడు వచ్చి–

"ఓ పదిరూపాయలు ఇవ్వండి టీ తాగుతా!" అన్నాడట.

ఆ జంటలోని అమ్మాయి 'టీ అయిదు రూపాయలేగా? పదిరూపాయలు ఎందుకు" అందిట తలెగరేస్తూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లా.

దానికా ముష్టివాడు– "మరి నా గర్ల్‌ఫ్రెండ్‌తో తాగాలి కదా!" అన్నాడట.

ప్రేమికుల జంటలోని కుర్రాడు –"నీకూ గర్ల్‌ఫ్రెండ్ వుందా?" అన్నాడట ఆశ్చర్యంగా.

"గర్ల్‌ఫ్రెండ్ వుంది కనుకనే ఇలా ముష్టోడినయ్యాను. ఒకప్పుడు బాగా వున్నవాడినే!" అన్నాడట ఆ ముష్టోడు.

చిత్రంగా అబ్బాయిల ప్యాంటూ, షర్టులకే ప్రధానంగా జేబులుంటాయి. అందుకే వాళ్ళకే 'పాకెట్‌మనీ' అవసరం ఎక్కువట!

అమ్మాయిలకు 'బాయ్‌ఫ్రెండ్' వుంటే చాలు! వేరే పాకెట్లూ, పాకెట్‌మనీలు అవసరం లేదట! బైక్‌మీద అమ్మాయిని ఎక్కించుకుని తిప్పడానికీ, సినిమాలకూ షికార్లకూ తిప్పడానికీ కొందరు తెలివైన అబ్బాయిలు – అమ్మాయిల దగ్గరే బైక్ పెట్రోల్‌కూ, పార్లర్‌లో ఐస్‌క్రీమ్‌లకూ డబ్బులు వసూలు చేస్తే 'ఛీప్' అయిపోరా మరి! కానీ ఆ తెలివితేటల మగవెధవలు వున్నారు కనుకనే పెళ్ళి పేరుతో లేవదీసుకుపోయి, అమ్మాయి తెచ్చిన 'నగానట్రా' దోచు

కుని నట్టేట ముంచిపోతున్న ప్రబుద్ధులూ వుంటున్నారు!

ఇప్పుడు అమ్మాయిలకే డిమాండ్!

ఎందుకంటే పదిమంది అబ్బాయిలకు తగినట్లుగా పదిమంది అమ్మాయిలూ ఇవాళ జనాభాలో లేరు. అంచేత కన్యాశుల్కాలు వరకట్నాలూ హుళక్కి అయిపోయి, అమ్మాయిల డిమాండ్లు పెరిగిపోతున్నాయి.

అదీకాక–అమ్మాయిలు చదువుల సరస్వతులుగా పోస్ట్ గ్రాడ్యుయేట్స్, డాక్టర్లు, ఇంజనీర్లు, పైలట్లు అయిపోతుంటే... మగపిల్లలు డిగ్రీలతో ఆపేసి, ఏవో ఉద్యోగాలు వెలగబెడుతున్న అమ్మాయిల స్థాయిని అందుకోలేని లక్షణాలతో వుంటున్నారు.

అటుగా 1, 2, 3, 4, 5 వున్న మగవాడే కొంత నయమన్నమాట! అంటే తెలీలేదా?

అయిదు అంకెల జీతం... నాలుగు చక్రాల వాహనం... మూడు రూమ్‌ల ఇల్లు... తనూ తన మొగుడూ... ఒకే ఒక సంతానం! అన్న పద్ధతిలో వుండేట్లయితేనే–ఆ అబ్బాయితో పెళ్లి గురించి ఆధునిక అమ్మాయి ఆలోచిస్తోంది. ప్రేమా, గీమా ఆ తర్వాత సంగతి.

'హజ్బెండ్' వేరు, 'బాయ్‌ఫ్రెండ్' వేరు.

ఇవాల్టి యువత ట్రెండే వేరు.

"ప్రేమ ఎంత మధురం.

ప్రియురాలు అంత కఠినం"... అని అబ్బాయిలు పాడుకున్నా, వేడుకున్నా... ఇవాళ వాడుక, వేడుక – పదార్థంగానే వుంది ప్రేమ.

'ప్రేమైక రస రసాయనం' అన్నారు.

రసాయనశాస్త్రం అంటే కెమిస్ట్రీయే కదా! వాళ్ళిద్దరికీ 'కెమిస్ట్రీ' కుదిరి, కలిసుంటే 'హిస్టరీ'. లేకపోతే పెళ్ళిళ్ళయినా అదో 'మిస్టరీ' గానే 'హిస్టీరిక్'గా మారిపోవచ్చు!

అంచేత 'ఫిజిక్స్' బాగుంటే సరిపోదు...

ట్రిక్కూ, మేథమేటిక్సూ తెలిసే మేథ వుండాలి. లేకపోతే వృథే! ప్రేమ ఓ వృధా కథే!

ప్రేమికుల 'దినం' ప్రేమకు 'తద్దినం' కాకూడదు మరి!

దాంపత్యానందంలోని హాస్యానందం అంది పుచ్చుకునేవారికే సుఖశాంతుల 'లాస్యానందం' లభిస్తుంది!

మానవత్వం నశించి 'మాయమైపోతున్నాడమ్మా మనిషి' అని ఆర్తి చెందుతున్న రోజులివి.


అంచేత ప్రేమ అంటే 'ప్రే ఫర్ మనిషి'.

అందులో 'ప్రే ఫర్ మగాడూ' వుంది... 'ప్రే ఫర్ మగువా' వుంది.

అదే ప్రేమ!


ప్రేమకు జిందాబాద్!

# ట్రెండింగ్ లవ్









# ఒక కోటిలింగం ఇద్దరు కళలు

కథ

ఎస్.వి.ఎమ్.నాగ గాయత్రి
9440465796

**కోటిలింగం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు....**
**కూర కలుపుకుంటూ ఆలోచిస్తున్నాడు....**
**అన్నం తింటూ ఆలోచిస్తున్నాడు....**
**మంచినీళ్లు తాగుతూ ఆలోచిస్తున్నాడు...**
**చెయ్యి కడుక్కుంటూ ఆలోచిస్తున్నాడు....**
**రింగు రింగులుగా పొగను వదులుతూ ఆలోచిస్తున్నాడు....**
**గుడ్లు మిటకరించి ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు.**

"ఏంట్రా ఈయన! ఇలా వెర్రిముఖం వేసుకొని ఆలోచిస్తున్నారు? పిచ్చిగానీ పట్టిందా ఏమి? మా తమ్ముణ్ణి పిలిపిస్తాను. పిచ్చి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లి రెండు కరెంట్ షాక్ లు ఇప్పించాలో ఏమో!" అంటూ కోటిలింగం నెత్తిన ఒక్క మొట్టమొట్టింది భార్య సూర్యకళ.

ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు కోటిలింగం. మొహమంతా కళ్ళు చేసుకుని తనవైపే చూస్తోంది సూర్యకళ.

"నో నెవర్...ఇక మీదట ఈ దాష్టీకం చెల్లదు!" అంటూ పెద్దగా అరిచాడు కోటిలింగం. అతని అరుపుకు అతనే భయపడి, తన వీపును తానే తట్టుకుని ధైర్యం తెచ్చుకున్నాడు.

"చూడు సూర్యం! ఒక మాట చెప్తా బాగా విను. నేను అద్భుతం చేయబోతున్నాను. గిర్రున వేగంగా తిరిగే కాలచక్రాన్ని ఆపేసి దాన్ని సర్రున వెనక్కి తిప్పేస్తాను!" అంటూ విసవిసా తన రూమ్‌లోకి వెళ్లిపోయాడు. కోటిలింగం మాటలు అర్థం కాక అయోమయంగా అతను వెళ్ళిన వైపే చూడసాగింది సూర్యకళ.

కట్ చేస్తే... కోటిలింగం హిమాలయాలకు చేరుకున్నాడు. తపస్సు ప్రారంభించాడు... ఘోరమైన తపస్సు చేస్తున్నాడు... ఘోరాతి ఘోరంగా తపస్సు చేస్తున్నాడు... గెడ్డం జానెడు పెరిగింది... మూరెడు, బారెడు పెరిగింది.... గెడ్డం నేలను తాకుతోంది. కోటిలింగం ఘోరమైన తపస్సుకు దేవుడికి ముచ్చెమటలు పట్టాయి. ఇక ప్రత్యక్షం కాక తప్పలేదు.

వన్ ఫైన్ మార్నింగ్ కోటిలింగం ముందు దేవుడు ప్రత్యక్షమయ్యాడు.

"భక్తా! కోటిలింగం! కళ్ళు తెరువు. నేను ప్రత్యక్షమయ్యాను. ఏం వరం కావాలో కోరుకో!" అన్నాడు దేవుడు.

కోటిలింగం కళ్లు తెరిచాడు.

దేవుణ్ణి చూశాడు. ఆనందంతో గెంతులేశాడు. చిన్నప్పటినుండి తనకు తెలిసిన స్తోత్రం చదవడం మొదలుపెట్టాడు.

దేవుడు విసుగ్గా మొహం పెట్టి... "నాయనా కోటిలింగం! అంత లెంగ్త్ వద్దు. క్లుప్తంగా చెప్పు. ఎందరో భక్తులు నా కోసం క్యూలో ఉన్నారు. అందరికీ వరాలు ఇవ్వాలి. నీ కోరిక ఏంటో త్వరగా చెప్పు!" అన్నాడు.

"స్వామి! కాలచక్రాన్ని వెనక్కి తిప్పేయండి. నన్ను పూర్వపు బ్రహ్మచారి కోటిలింగంగా మార్చేయండి!" ఆవేశంతో అన్నాడు కోటిలింగం.

దేవుడు మరింత విసుగ్గా మొహం పెట్టి, "ఎన్నో యుగాల్లో ఎందరో భక్తులకు వరాలిచ్చాను. నువ్వు కోరుకున్న కోరికేంటో నాకు అర్థం కావడం లేదు నాయనా!" అన్నాడు.




"అదే స్వామీ!... మీ ముందు దాపరికం ఎందుకు? అసలు విషయం చెప్తా వినండి. నేను చంద్రకళ అనే అమ్మాయిని చూట్టానికి పెళ్లిచూపులకు వెళ్లి, అక్కడ సూర్యకళని పెళ్లి చేసుకున్నాను. మీరు మళ్లీ ఆ టైంలోకి తీసుకెళ్తే... అంటే పోయిన సంవత్సరం డిసెంబర్ 16, 10 గంటలకు... అప్పటికి కాలచక్రాన్ని వెనక్కి తిప్పితే, నేను చేసిన తప్పును సరిదిద్దుకుంటా! సూర్యకళకు బదులు చంద్రకళకు తాళిబొట్టు కడతా!" అసలు విషయం చెప్పాడు కోటిలింగం.

దేవుడు చిన్నగా నవ్వి–"చూడు భక్తా కోటిలింగం! భార్యలు మారినా బాధలు కామనే అని తెలుసుకో! అండపిండ బ్రహ్మాండాలు

సృష్టించిన అనుభవంతో చెప్తున్నాను. సూర్యకళ అయితేనేం? చంద్రకళ అయితేనేం? నీ పిచ్చి ఆలోచన మానుకో నాయనా పిచ్చి కోటిలింగం! నువ్వు సూర్యకళను కాక చంద్రకళను పెళ్లి చేసుకోనుంటే, పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టుగా వుండేది. చంద్రకళను పెళ్లి చేసుకున్న భజగోవిందం ఎన్ని పాట్లు పడుతున్నాడో వైకుంఠం నుండి లైవ్‌లో చూస్తూనే ఉన్నాను కదా! మనకు ఏం దొరికిందో దాంతోనే సంతృప్తి పడాలి. ప్రపంచంలో ఎన్ని భాషల్లో ఉన్న పుస్తకాలనైనా చదివి అర్థం చేసుకోవచ్చు. కానీ అర్థం కాని పుస్తకం... భార్య!" అని విడమరచి మరీ చెప్పాడు దేవుడు.

కోటిలింగానికి కోపం వచ్చింది.

"స్వామీ! నేను తపస్సు చేశాను. నువ్వు ప్రత్యక్షమయ్యావు. నేను వరం కోరితే నువ్వు ఇవ్వక తప్పదు!" అన్నాడు.

దేవుడు చిరునవ్వు నవ్వి– "చూడు కోటిలింగం... ప్రతి మనిషికి ఉన్నదానికంటే లేని దానిపై ఆశ ఎక్కువ. నీవు నేను చెప్పేది అర్థం చేసుకో! సరే నువ్వు ఇంతగా కోరుతున్నావు కాబట్టి... నీకు ఒక అవకాశం ఇస్తాను! ప్రయత్నించు!" అన్నాడు.

"స్వామీ! త్వరగా ఆ వరం ఇవ్వండి" సంబరపడిపోయాడు కోటి లింగం.

ఇక ఎంత చెప్పినా వినకపోవడంతో దేవుడు– 'తథాస్తు!' అనేసి టింగ్ మంటూ అదృశ్యమయ్యాడు.

కోటిలింగం ఉబ్బి తబ్బిబ్బైపోయి గంతులేశాడు.

తనకు కొత్త పెళ్ళాం వస్తోంది. తన జీవితమే మారిపోతుంది. ఊహల్లో తేలిపోతున్నాడు కోటిలింగం.

✦✦✦

సంవత్సరం క్రిందటి డిసెంబర్ 16, 10 గంటలకు వెనక్కి వెళ్ళి పోయాడు. ఇప్పుడు చంద్రకళ ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు కోటిలింగం.

ఎదురుగా మేకప్‌లో చంద్రకళ.


టిఫిన్ ప్లేట్లను తెస్తూ కనపడింది సూర్యకళ.

'వామ్మో! జాగ్రత్తగా ఉండాలి. ఇదివరకు జరిగిన పొరపాటు ఇప్పుడు జరగకూడదు'. తనకు తానే హెచ్చరించుకున్నాడు కోటిలింగం.

పెళ్లిచూపులు అయ్యాక చంద్రకళతో మాట్లాడాలని చెప్పాడు.

వాళ్ళ నాన్న–"దానికేం భాగ్యం బాబు!" అంటూ అతన్ని బాల్కనీలో కుర్చీ వేసి కూర్చోబెట్టారు. కూర్చున్న రెండో నిమిషమే ఆత్రంగా హాల్లోకి తొంగి చూశాడు కోటిలింగం. సూర్యకళ కనబడ్డది.

అలవాటులో పొరపాటుగా కుర్చీలోంచి చటుక్కున లేచి –




"మీరు చాలా బాగున్నారు. మీరు నాకు తెగ నచ్చేసారు. పెళ్ళంటూ చేసుకుంటే మిమ్మల్నే చేసుకుంటా!" అంటూ గబగబా వాగేసాడు.

సూర్యకళ ఆశ్చర్యంగా కళ్ళింత పెద్దవి చేసుకొని చూస్తోంది. సరిగ్గా ఆమె వెనకాలే బాల్కనీలోకి వచ్చిన చంద్రకళ ముందుకు వచ్చి...

"ఏమిటి సంగతి? ఎవరు నచ్చారు మీకు?" అంటూ గద్దించింది.

కోటిలింగం మరింత కంగారు పడిపోయి– "మీరే.. మీరే... నచ్చారు. చీకట్లో పోల్చుకోలేక ఈమెను చూసి మీరు అనుకొని బుద్ధి

తక్కువై చెప్పాను!" అన్నాడు కోటిలింగం.

✦✦✦

ఓ వారం తర్వాత చంద్రకళతో సినిమా ప్లాన్ చేసాడు కోటిలింగం.

ఏవేవో ఊహలతో తేలిపోతూ స్థిమితంగా ఉండలేక అటూ ఇటూ నడుస్తున్నాడు కోటి లింగం. ఇంతలో చంద్రకళ రానే వచ్చింది. అయితే సూర్యకళ స్కూటర్ వెనకాల కూర్చుని. ఇక తప్పేది లేక ముగ్గురికి టికెట్స్ తీసుకొని థియేటర్ లోపలికి నడిచాడు కోటిలింగం.

చంద్రకళ పక్కన కూర్చున్నాడు.

సినిమా మొదలైంది. కాసేపటికి చంద్రకళ అసహనంగా కదలడం మొదలు పెట్టింది. ఎదురుగా కొంగమెడ ఒకటి డెబ్బయ్యేళ్ళ హీరో పాతికేళ్ల హీరోయిన్‌తో వేసే గంతులు చూడని వ్వడం లేదు. చిన్నగా చంద్రకళ, సూర్యకళ చెవి కొరికింది. మరుక్షణం విఠలాచార్య సినిమాలోలా చంద్రకళ మాయమై ఆ స్థానం లో సూర్యకళ, సూర్యకళ కుర్చీలో చంద్రకళ ప్రత్యక్షమయ్యారు.

ఈ హఠాత్పరిణామానికి కోటిలింగం గతుక్కుమన్నాడు. 'డామిట్ కథ అడ్డం తిరి గింది!" అనుకుంటూ పళ్ళు పట పట కొరి కాడు కోటిలింగం.

"పళ్ళు నూరడం ఆపండి! ఆ సౌండ్‌కి నాకు డైలాగ్స్ వినబడలేదు!" విసుక్కుంది సూర్యకళ. కోటిలింగం చప్పున నోరు మూసేసాడు.

సీన్ కట్ చేస్తే... కళ్యాణ మండపంలో పెళ్లి పీటలపై చంద్రకళ. కోటిలింగానికి సంతోషం కంటే ఆందోళన అధికంగా ఉంది.

"నేను కోరుకున్న వరం నిజమయ్యే క్షణం వచ్చింది. అయినా ఎందుకు ఈ ఆందోళన? దేవుడు కచ్చితంగా చెప్పాడు... ఇది వర్కౌట్ అవ్వదని. నాకు సూర్యకళతోటే పెళ్లి అన్నాడు. విధిని మార్చలేమన్నాడు. అయినా నా జీవిత కథను నేనే రాసుకుంటా!... నా తలరాతను మార్చుకుంటా!" అనుకున్నాడు కోటిలింగం.

పెళ్ళికూతురు ముస్తాబులో చంద్రకళ అందంగా కనబడుతోంది.

"పెళ్లికూతురు వెనకాల ఎవరు?... సూర్య కళ! దేవుడు నాతో గేమ్స్ ఆడుతున్నాడు. తాళి కట్టేటప్పుడు చంద్రకళను తోసేసి సూర్యకళ కూర్చుంటుందా? కుదరదు! నేను సూర్యకళకు ఎటువంటి పరిస్థితుల్లో తాళికట్టను... సిక్స్ హండ్రెడ్ అయినా... హండ్రెడ్ సిక్స్ అయినా నేను అనుకున్నది సాధిస్తా. గట్టిగా అనుకు న్నాడు. సూర్యకళకు కాదు... చంద్రకళకు తాళి కట్టాలి. సూర్యకళకు కాదు... చంద్రకళకు తాళి కట్టాలి" తనను తాను హిప్నటైజ్ చేసుకుంటూ తాళి కట్టడానికి పీటల మీదనుంచి లేచాడు కోటిలింగం.

పదేపదే చంద్రకళవైపు... సూర్యకళవైపు మార్చి మార్చి చూస్తున్నాడు. "సూర్యకళకు కాదు... చంద్రకళకు తాళి కట్టాలి." ధ్యాసంతా సూర్యకళ వైపే ఉందతనికి.


"చంద్రకళకు కాదు... సూర్యకళకు తాళి కట్టాలి. చంద్రకళకు కాదు... సూర్యకళకు తాళి కట్టాలి." తనకు తానిచ్చుకునే సజెషన్ తారు మారయ్యిందనే సంగతి తెలీలేదు అతడికి. తాళి కట్టడానికి వీలుగా కొంచెం వంగొని చంద్రకళ జడ పైకెత్తి పట్టుకుంది సూర్యకళ.


కోటిలింగం సూర్యకళ వైపే చూస్తున్నాడు.

"చంద్రకళకు కాదు... సూర్యకళకు తాళి కట్టాలి!" చాలా జాగ్రత్తగా తాళి పట్టుకుని ముందుకు వంగాడు.

తనకు ఎదురుగా వంగొని ఉన్న సూర్య కళ మెడలో తాళి కట్టాడు. జరిగింది అర్థమయి కెవ్వున అరిచాడు కోటిలింగం.

ఇదంతా ఆకాశంలోంచి చూస్తున్న దేవుడు కిసుక్కున నవ్వాడు.



ఎవరైతే తమ చుట్టూ ఉన్న మనుషులు అన్ని వ్యథలూ మరచి... హాయిగా నవ్వుతూ వారి జీవితాలు అభివృద్ధిపథంలో పయనించేలా చేస్తారో... వారి నవ్వుల్లో మెరిసే ఆనందం చూసి ఆనందిస్తారో.. అవే తమ లక్ష్యంగా కృషి చేస్తుంటారో... అలాంటి మహానుభావులు లక్షల్లో ఒకరుంటారు.

ఆ ఒక్కరు మన **డాక్టర్ కె.వి.రమణాచారి గారు.** ఫిబ్రవరి,8... ఆయన పుట్టిన్రోజు పురస్కరించుకుని, కె.వి.రమణగారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వేంకటేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ...జన్మదిన శుభాకాంక్షలతో హాస్యానందం ఈ చిన్ని 'అనుబంధం' ప్రకటిస్తోంది.




హాస్యానందానికి కొండంతా అండగా... హాస్యానందం అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ చేయూతనిస్తున్న మా రమణగారి పుట్టిన్రోజు మాకు పండుగ!



ఆయన ఆశీస్సులతో హాస్యానందం పరిధి, విలువ పెరిగింది... తెలుగుకార్టూనిస్టుల దినోత్సవం వైభవంగా జరగడానికి కారకులైన మా రమణగారికి కార్టూనిస్టు మిత్రుల తరపున కృతజ్ఞతాపూర్వక జన్మదిన శుభాకాంక్షలు!

రమణగారు ఎన్నో సంస్థలకు సహాయ పడ్డారు. ఆంధ్రసారస్వత పరిషత్ స్థలం ఆ సంస్థకు దక్కేందుకు... శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం నిలవడానికి, నాలుగంతస్థుల భవనంగా మారడానికి... సురభి సమాజాలు ఈ రోజు తిరిగి నాటక ప్రదర్శనలు చేస్తున్నాయంటే... హైదరాబాద్ జంట నగరాలలో నాటకాలకు అంకితమై రసరంజని పని చేస్తోందంటే... రమణగారి కృషికి నిదర్శనాలు! ఇక ఆర్థిక, హార్దిక సహకారం పొందిన కళాకారులకు లెక్కేలేదు. ఇవన్నీ ఒక వైపైతే ... 'ఆనంద నిలయం' వృద్ధాశ్రమం, భారతదేశంలోనే అష్టాదశ శక్తి పీఠాలు ఒకే చోట నెలకొల్పిన మహానుభావులు డా॥ కె.వి.రమణగారు.

# ఆనంద నిలయం...
# ఆదిశక్తి ఆలయం!

సిద్ధిపేట జిల్లా కొండపాక మండలంలో రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్నది–
**'ఆనంద నిలయం'**
డా॥కె.వి.రమణగారి చిరకాల స్వప్నం.
89 ఎకరాల సువిశాల స్థలంలో ఏర్పాటైంది 'ఆనంద నిలయం.
అక్కడే శ్రీ వెంకటేశ్వర ఆలయం నిర్మించారు. పదిహేను ఎకరాల్లో మామిడితోట సాగుచేస్తున్నారు. దీనికి 'నారాయణ వనం' అని నామకరణం చేశారు. అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో వృద్ధులు హాయిగా జీవిస్తున్నారు.

వారికి ఏ లోటు రాకుండా ఈ ఆశ్రమం నిర్వహిస్తున్నారు.

భారతదేశంలో అష్టాదశ శక్తి పీఠాల అమ్మవార్లు ఒకే దగ్గర కొలువైన క్షేత్రం ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయం.

దేశంలోని వివిధ రాష్ట్రాలలో భక్తుల కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్న అమ్మవార్లు ఇక్కడ కొలువుదీరారు.

హైదరాబాద్–కరీంనగర్ రాజీవ్ రహదారిలో కొండపాకలో ఉన్న ఈ సువిశాలమైన ప్రాంగణం ఇప్పుడు ఓ ఆధ్యాత్మిక కేంద్రం.
శక్తిపీఠాలు పద్దెనిమిది. వీటిలో పదిహేడు మనదేశంలో ఉండగా... శాంకరీదేవి శ్రీలంకలోని ట్రింకోమలిలో ఉంది.

కామాక్షి (కంచి), శృంఖల (కోల్‌కతా), చాముండేశ్వరి (మైసూరు), జోగులాంబ (అలంపూర్), భ్రమరాంబ (శ్రీశైలం), మహాలక్ష్మి (కొల్హాపూర్), ఏకవీర (మాహుర్), మహాకాళి (ఉజ్జయిని), పురుహూతిక (పిఠాపురం), గిరిజ (జాజ్‌పూర్), మాణిక్యాంబ (ద్రాక్షారామం), కామరూపిక (కామాఖ్య), మాధవేశ్వరి (ప్రయాగ), వైష్ణవీదేవి (జమ్మూ), మంగళగౌరి (గయ), విశాలాక్షి (కాశి), సరస్వతీ దేవి (శ్రీనగర్) రూపాలను... ఈ క్షేత్రంలో దర్శించుకోవచ్చు.

ఇదే ప్రాంగణంలో లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శివపార్వతులతో కూడిన 22 దేవాలయాలను నిర్మించడం విశేషం.












శక్తిపీఠాల ఆలయానికి కుడిపైపున శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం కొలువైంది. అమ్మవారి మందిరానికి ఎదురుగా అరుదైన గోవులతో ఓ గోశాలనూ నిర్వహిస్తున్నారు. ఇది పిరమిడ్ ఆకృతిలో ఉండటం విశేషం. మరోపక్క ఆనంద్ నిషాంత్ బాలసదన్ చారిటబుల్ ట్రస్టు, ఆనంద నిలయం వృద్ధాశ్రమం ఉండటంతో ఆ ప్రాంతం భక్తులు, సామాజిక సేవకుల సందర్శనలతో సందడిగా ఉంటుంది. గోశాల ప్రాంగణంలో శ్రీరాధాకృష్ణసమేత గోమాత మందిరం మరో ప్రత్యేక ఆకర్షణ.

**నిజంగా ఆనంద నిలయమే...**


డా॥కె.వి.రమణగారి నేతృత్వంలో ఈ ఆనందనిలయం ఆశ్రమం నడుస్తున్నది. ఎంతోమంది అభాగ్యులకు ఆశ్రయం కలిపిస్తున్న ఈ ప్రాంగణంలో అష్టాదశ శక్తి పీఠాలను నెలకొల్పితే బాగుంటుందని సిద్దిపేటకు చెందిన 82 ఏళ్ళ భక్తులు శ్రీ గట్టు రాం రాజేశ్వర గుప్తగారు ఆలోచించారు. ఆయన సంకల్పం గురించి తెలుసుకున్న డా.రమణగారు ఆనంద నిలయంలో ఐదు ఎకరాల స్థలం ఇచ్చారు. వెంటనే ఈ మహత్తర కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అలా ఆయన ఆలోచన, ఆశయం... రమణగారి సత్కర్మ అభిలాష వల్ల ఆలయం పూర్తయ్యింది.

ఈ ఆలయాన్ని ఇటీవలే శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా ప్రారంభించారు.

అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవార్ల ప్రతిష్ఠ పూర్తయ్యింది.

'దేశ విదేశాలలో పద్దెనిమిది స్థలాల్లో కొలువుదీరి ఉన్న అమ్మవారి రూపాలను ఒకేచోట నెలకొల్పడం అంటే... అది అమ్మవారి అనుగ్రహం, శంకరుడి కృపగా భావిస్తున్నాం. ఆనంద నిలయం ప్రాంగణంలో 22 దేవాలయాలను నిర్మాణానికి సహకరించిన వారికి శతకోటి వందనాలు!" అంటున్నారు కేవీరమణగారు.









**జీ**వనయానంలో మనకు ఎదురయ్యే సంఘటనలు, వ్యక్తులు అందరూ కనీసం మనని తాకకుండానే వెళ్ళిపోతాయి / పోతారు. కానీ కొందరు మాత్రం మనల్ని తాకడం, తట్టడం మాత్రమే కాదు... మన గుండెల్లోకి నడిచొస్తారు. కొలువై... మేలు కొలుపై నిలుస్తారు. అలాంటి వ్యక్తులు మన పైన ప్రభావం చూపించడానికి ఏళ్ళ కాలం అక్కరలేదు. అత్యున్నత వ్యక్తిత్వం గల వ్యక్తుల సమక్షంలోని 30 నిమిషాలు చాలు ఒక జీవితాన్ని నిర్మించడానికి!

కోటికొక్కరిలో మాత్రమే ఉండే ఆ శక్తి పేరే–

డాక్టర్ కె.వి.రమణాచారి, ఐ.ఏ.ఎస్!

**–మామిడి హరికృష్ణ,**

డైరెక్టర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ



**ఆ**యన మనముందు నిలుచుంటే,
వెనుక వేంకటాచలం 'కొండ' ఉన్నట్లే...
కళాకారుల సంక్షేమానికై ఆయన శంఖం పూరిస్తాడు...
ఎవరికైనా సరే కష్టాలొస్తే చక్రం అడ్డువేస్తాడు...
మాపాలిట ఆయన సాక్షాత్తు...
సివిల్ డ్రస్‌లోఉన్న శ్రీనివాసుడే.

**–తనికెళ్ళ భరణి**

ఎవరిదగ్గరికైనా
సహాయం కోసం
వెళితే సలహాలిస్తారు.
మరి రమణాచారిగారు
సలహా కోసం వెళితే
సహాయం చేస్తారు.

**–ఉత్తేజ్,**
రచయిత



**ర**మణగారిని చూస్తే నిజంగా పదవీ విరమణ అనే నిబంధనకు అర్థముందా అని అనుమానం కలుగుతుంది. ఆయన ఉద్యోగం నుంచి విరమణ పొంది ఉండి వుండవచ్చు. కానీ పని నుంచి కాదు. ఆయనింకా చేయవలసింది చాలా ఉంది ఈ తెలుగు ప్రజలకు. అది ఎలా చేయాలో, ఏం చేయాలో నిర్ణయించుకోగల విచక్షణ ఆయనకుంది. ఆ పని చేయగల శక్తీ ఉంది.

**–డా॥ సి.మృణాళిని**



**క**ళారాధకుల గుండెలలో నెలకొన్న
వెంకట రమణుడు...
కళౌన్నత్యానికి నిత్య కంకణ బద్ధుడు...
కళలో దైవాన్ని కనుగొన్న భక్తుడు.
దైవంలో కళని కొలిచే రసానందునికి...
జన్మదిన శుభాకాంక్షలు. **–బ్నిం**

ఆయనకు అందరూ గుర్తే!
ఆయన అందరికీ ఒక 'గుర్తు'.
'ఆత్మ విశ్వాసమే' తప్ప...
అహంకరించని నైజం
ఆయనది.

**–సుధామ**



అతని మనసు రమణీయము...
అతని తనువు కమనీయము...
పొరపాటున పుడమిపైకి
దిగివచ్చిన గంధర్వుడు
పదవికి వన్నెను తెచ్చిన
పరిపాలన పాటవం
పదునెక్కిన భావాలకు
పలుకులలో మాధుర్యము

అతడే రమణాచార్య మ
హదీయ రాకాచంద్రుడు
శ్రీనివాస పాదాంబుజ
చిద్రూప కళాషోడశి
దైవకార్య నిర్వహణకు
దీక్షా కంకణ ధారణ
నూరు శరత్తులు నిండుగ
జీవింపుడు సత్కీర్తి !!


**–ప్రొ.ముదిగొండ శివప్రసాద్**






## హాస్యప్రియులకు విందు భోజనం

## జయదేవ్ జోక్స్




**ఈ** పుస్తకం చూడగానే జయదేవ్ గారు జోకుల పుస్తకం ప్రచురించడం ఏమిటి? కార్టూన్ల పుస్తకమే మరొకటి తీసుకురావచ్చు కదా! అనే ప్రశ్న ఎంతోమంది కార్టూనిస్టులలో ఉదయిస్తుంది.

కానీ బుక్ మొత్తం చదివాక హాస్య ప్రియులకు ఎంతో తృప్తి మిగులుతుంది. ఎందుకంటే ఈ కొత్త రకం జోకులు నవ్వుల పువ్వులు పూయిస్తాయి. ముఖ్యంగా రాజులు, రాణులు, రాజ్యాలు, యుద్ధాలు, ఋషులు, జంతువులు, పక్షులు, కౌరవులు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో వెరైటీ టాపిక్స్ కనిపిస్తాయి. ఈ జోకుల పుస్తకం హాస్యప్రియులకు విందుభోజనం వంటిది. ఎందుకంటే 700 జోకులకు 700 ఫోజులతో చిత్రాలను చిత్రించి మనకు అందించారు. ఇదొక గొప్ప విషయం. సీరియస్‌గా మొదలైన జోకు చిరు దరహాసంతో ముగుస్తుంది.

ఎప్పుడన్నా ఎక్కడన్నా జోకులు చదివితే ఎక్కడో చదివినట్లు స్ఫురిస్తుంటాయి. కొన్నన్నా రిపీట్ అయినవే చదువుతుంటాం. కానీ ఇన్ని ఒరిజినల్ జోకులు రాయడం జయదేవ్ గారికే సాధ్యమైంది.

అందమైన ముఖచిత్రంతో మంచి లే అవుటుతో ప్రచురించిన ఈ పుస్తకం విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లి వారు ప్రచురించారు. **వెల: 250 రూపాయలు**

కార్టూనిస్టులందరూ కొని చదివి దాచుకోవాల్సిన పుస్తక ఈ **'జయదేవ్ జోక్స్'**

వివరాలకై 8220692686 నెంబరుకు సంప్రదించండి.

**-డా॥ రావెళ్ళ**

## నవ్వుకున్నోళ్లకు నవ్వుకున్నంత..

**ఆ**రోగ్యంగా వుండాలంటే నవ్వు ప్రాక్టీస్ చేయాలని డాక్టర్లు ప్రిస్క్రిప్షన్‌లో నవ్వుని మూడు పూటల వేసుకునే బిళ్ళలతో పాటు దీన్నొక ఔషధంగా చెప్తున్నారు. విడ్డూరం అనిపించినా నవ్వులో కూడా తెలుగుదనానిదే పైచేయి. తెలుగు వాళ్ళు హాస్యానికి ప్రాధాన్యత ఇస్తారు అందుకనే కార్టూన్ రంగం ఈ నేల మీద మూడు గీతలు ఆరు నవ్వులుగా వర్ధిల్లుతోంది,

గీతను తన రాతతో జోడించి హాస్యాన్ని పంచుతున్న యువ కార్టూనిస్ట్ **నాగేశ్వరం హరికృష్ణ** తన వ్యంగ్య చిత్రాల్ని పుస్తకరూపంలో తెచ్చి నవ్వులు పంచుతున్నారు.




హరికృష్ణ మంచి చదువరి. కొవ్వూరు ABN & PRR కళాశాలలో కంప్యూటర్ సైన్సులో B.Sc. డిగ్రీ చేసి, కార్టూన్ రంగాన్ని ఎంచుకోవటం జరిగింది. హరికృష్ణలోని చదువరి చక్కని కార్టూనిస్ట్‌గా మారారు.

హరికృష్ణ కార్టూన్లు చూస్తున్నప్పుడు తనలోని హాస్యకారుడే కాకుండా ఒక బాధ్యతాయూతమైన వ్యక్తి గోచరిస్తాడు, సమాజం, పర్యావరణం గురించి ఆలోచన చేస్తాడు, తెలుగు భాష మీద జరుగుతున్న దాడి గురించి సామాన్య మనిషికి అందని కనీస అవసరాల గురించి ఆందోళన పడతాడు, పాలక వర్గాన్ని నిలదీస్తున్నట్టు కనపడతాడు. అందుకనే ఈ పుస్తకంలో కొన్ని కార్టూన్లు మనల్ని ఆలోచింప చేస్తాయి.

చాలామంది గీసి రాసినప్పటికి రొటీన్‌కు భిన్నంగా గీసి మెప్పించడం తోనే ఇక్కడ కార్టూనిస్ట్ విజయం చెందాడు.

ఈ పుస్తకంలోని కార్టూన్లు అన్ని హాయిగా నవ్విస్తాయి. కార్టూనిస్ట్ హరికృష్ణకు ఫోన్ చేసి ఇప్పుడే పుస్తకాన్ని రప్పించుకోండి.

నవ్వుల ఖజానా మీ పెదవులపై మెరుస్తుంది...

నవ్వుకున్నోళ్లకు నవ్వుకున్నంత...

**ఈ కలర్‌ఫుల్ కార్టూన్ పుస్తకం వెల: 250 రూపాయలు**

**-నేలపూరి.రత్నాజీ**

**ప్రతులకు:**

**N.Hari Krishna,** S/o Hanuman,
Near ZPH School, Kalavapamula-521164
Vuyyur mandal, Krishna district. **Phone: 9951817518**

# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## వారసుడు కావాల్సిందే


**"మీరు ఇందాకటి నుండీ మందకొడిగా సిగ్గుపడుతూ, పందెంకోడిలా ఎత్తెత్తి నడుస్తోంది అందుకా!...అవ్వ! అయినా... ఇప్పుడు వెనక్కి వెళ్ళడం అంత సులువా? ఒంటి మీదకి రగ్గు కప్పుకుని, ఒంట్లోకి పెగ్గు పంపుకుని వెచ్చగా పడుకోక... ఎందుకండీ ఈ చలికాలంలో కలికాలం ఆలోచనలు! ఒకవేళ అలాంటి థాట్ మీ బుర్రలోకి దూరి ఫైట్ చేస్తూంటే... ఓ వర్రీ అయిపోక దాన్ని కర్రతో కొట్టినట్టు తరిమేయండి. మీ మనసుని నసపెట్టనీయకండి." చెప్పిందామె.**

"నువ్వెన్నన్నా చెప్పు, నేను వింటాను. కానీ పాటించను. నేను కచ్చితంగా వెనక్కి వెళతాను... మళ్లీ తండ్రినై తీరతాను. అప్పుడంటే, ఆ రోజుల్లో మన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా దూరం ఆలోచించి, ఒక అబ్బాయి చాలనుకున్నాను. కానీ దురదృష్టం ఏంటంటే... అమ్మాయి పుట్టింది. సరేలే ఓకే... అని నాకు నేనే సర్దిచెప్పుకున్నాను. కానీ ఇప్పుడు ఇంత పేరొచ్చాక, డబ్బొచ్చాక నాకో వారసుడు కావాలనే కోర్కె నాలో విత్తనంలా మొదలై ఇప్పుడు మొలకెత్తి చిగురించింది." చెప్పాడు ఆవదాల రావ్ కొంచెం సిగ్గుపడిపోతూ.

"దరిద్రంగా ఉంది. ముందు మీ ఆలోచనల్లో మొలిచిన ఆ కలుపు మొక్కని పీకి పారేయండి. లేదంటే నేనే మీ పీక పిసికి అవతల పారేస్తాను.అయినా మీకేమో యాభై ఆరు... నాకేమో యాభై రెండు.ఈ ముసలి వయసులో మీ బుద్ధికి ముసలం పట్టింది... అందుకే ఐస్ మీద పడుకునే వయసు దగ్గర్లో ఉన్నా... ఐశ్వర్యం ఉందనే పొగరుతో వెనక్కి వెళ్తానని వెర్రి కలలు కంటున్నారు. పైగా మన అమ్మాయికి పెళ్లి అయి మొన్ననే భళ్ళున వాంతులు చేసుకుని త్వరలో తల్లి కూడా కాబోతోంది. ఇలాంటి ఈ తాత వయసులో మళ్ళీ మీరు తండ్రవడం, నా పిండాకూడూ అంటే... మన చుట్టాలు మనల్ని చుట్టపీకల్లా చులకనగా చూసి మన గౌరవాన్ని పలచన చేస్తారు. అయినా ఇప్పుడు, ఈ వయసులో తండ్రి కావాల్సిన అవసరం ఏవుంది?" టపా టపా తల కొట్టుకుంది లక్ష్మమ్మ.

"పిచ్చిదానా!ఇప్పుడే మళ్ళీ తండ్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది కూడా ఒక అబ్బాయిని కనాలి. ఎందుకంటే, నా ఆస్తికి వారసుడు లేకుండా ఎలాగా?... నేను మొదలైంది జూనియర్ ఆర్టిస్ట్‌గా, ఏదో చిన్నా చితకా క్యారెక్టర్లు చేసేవాడ్ని. కానీ ఇప్పుడు నేను ఒక పెద్ద హీరో, కాదు, కాదు... పెద్ద స్టార్ అయిపోయాను. అందుకని ఇప్పుడు నా వారసత్వానికి ఒక వారసుడంటూ ఉండొద్దూ?..." అడిగాడు గర్వంగా.

"మీరు బుడ్డ, బుడ్డ పాత్రలు వేసే స్థాయి నుంచి భూమండలం స్టార్ స్థాయికి వచ్చారు సరే. కానీ అపుడు మనం, అప్పడాలమ్ముకునేప్పుడు మనకి బంగారంలాంటి ఒక అమ్మాయి చాలనుకున్నాం. కొడుకైనా, కూతురైనా అదే అనుకున్నాం. ఆ తర్వాత మీరు సిగ్నల్స్ దగ్గర అప్పడాలమ్ముతున్నప్పుడు ఓ అరవ డైరెక్టర్ చూసి, మీకు ఓ తమిళ సినిమాలో అప్పడాలమ్ముకునే వేషం ఇచ్చాడు. దాంతో మీకు అప్పడం స్టార్ అని పేరొచ్చి, తర్వాత వెనక్కి చూడకుండా తమిళ సినిమాల్లో నిలదక్కుకున్నారు, మంచిదే. మళ్ళీ ఇప్పుడు మీరు కొడుకు కావాలనుకుంటే అది మీకు బతికుండగానే కొరివి పెడుతుంది. ఎందుకంటే... దాన్ని ఇప్పటివరకు కొడుకులా పెంచాను. అలాంటిది, ఇపుడు మీరు వెనక్కి వెళ్ళి, రివర్స్ ఆపరేషన్ చేయించుకుని, సరోగసిలో కొడుకుని కంటే, కొడుకైనా కూతురైనా నువ్వే అని మనమ్మాయికి ఇప్పటివరకూ మనం అబద్ధాలు చెప్పి మభ్యపెట్టినట్టు అవదూ?! కనుక...ఈ



పోయే వయసులో ఇలాంటి పోయేకాలం బుద్ధులు మంచివి కాదండీ... అయినా మీకు ఏవంత ఆస్తుందని, ఏవంత పెద్ద స్టార్ అనీ ఈ భ్రమలన్నీ! ఇప్పుడైనా విడిచిపెట్టండి, రజినీ కాంత్, కమల్ హాసన్ మీలాగా మళ్లీ అబ్బాయి కావాలనుకుంటే ఏమయ్యేది?... కానీ వాళ్లకి మీలాంటి పైత్యం లేదు. కనుక మీ ఆలోచన మార్చుకోండి!" గడ్డం పట్టుకుందామె.

"నేను నిర్ణయం తీసేసుకున్నాను. పైగా నేను త్వరలో ఒక యూనివర్సల్ ఇంగ్లీష్ సినిమాలో నటించబోతున్నాను. అది ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. దాని బడ్జెట్ మూడువేల కోట్లు, ఆ సినిమా విడుదలయ్యాక, ఈ భూ మండలం స్టార్ ఇంకా పెరిగి భూగగన్ స్టార్ అయిపోతాడు. అంత పేరూ, డబ్బూ సంపాదించాక, నా తర్వాత ఒక వారసుడు అంటూ ఉండొద్దూ?" అన్నాడు మరింత గర్వం పోతూ.

"ఇక మీ ఇష్టం! ఈ విషయం మీ ఫాన్స్‌కి తెలిస్తే మీమీద అయిష్టం పెంచుకుంటారు. దాంతో మీ స్టార్‌డమ్‌కి అరిష్టం పడుతుంది. ఎందుకంటే ఇప్పటిదాకా ఆడపిల్ల అయినా అబ్బాయి అయినా ఒకటే! అసలు అమ్మాయిలని తక్కువగా చూడటం ఒక జబ్బు, అలా చూసేవాళ్ళు అసలు మనుషులే కాదూ అంటూ మీ సినిమాల్లో పేజీల పేజీల డైలాగులు చెప్పి, ఇప్పుడు ఈ వయసులో కొడుకు కోసం ఇంత ఆరాట పడితే మీ మీద మహిళా సంఘాలు పోరాటం చేసినా చేస్తాయ్. ఈ పనితో మీ పై ఉన్న ఆ సదాభిప్రాయం సముద్రంలో కలిసి, మీ మీద దురాభిప్రాయం కలుగుతుంది. దాంతో మీ ఫాన్స్ మీకు దూరమైపోతారు" హెచ్చరిస్తున్నట్టుగా చెప్పిందామె

"నువ్వు మరీ అంత అమాయకంగా మాట్లాడకు. అయినా సినిమా అన్నాక అనేకమైన డైలాగులు చెప్పాల్సొస్తుంది. అందుకని అవన్నీ నిజ జీవితంలో కూడా అనుసరించగలవా ఏంటి? ఉదాహరణకు పులిబాబు సినిమాలో హీరోయిన్‌ని ఓ పోకిరీ, 'పిల్లా రసగుల్లా, వస్తావా గోల్కొండ ఖిల్లా' అని కన్ను కొట్టగానే, వాడి ముక్కు మీద గుద్ది పెద్ద ఫైట్ చేస్తాను. ఇక నిజజీవితంలో, నిన్ను గోవాలో ఒకడు 'కోవాలా ఉన్నావ్, చూస్తేనే గుండెల్లో లావా పొంగుతోంది' అని కామెంట్ చేసాడు. నేను ఏమైనా అంటే... వాడు ఏ కర్రతో నా బుర్ర మీద కొడతాడో అనే భయంతో, కామ్‌గా అక్కడినుండి నిన్ను తీసుకొచ్చేసాను.



ఇకపోతే అలాంటి గొప్ప విలువలు, ఎవరో కొందరు మహానుభావులు పాటిస్తారు కానీ, నాలాంటి వాళ్ళు నటించి వదిలేస్తారంతే. అయినా ఎవరో పాట పాడితే... నేను లిప్ మూమెంట్ ఇస్తాను. ఎవరో రాసిన డైలాగ్‌ని బట్టీ పట్టి చెప్తాను. డైరెక్టర్ ఏం చేయమంటే మరమనిషిలా అదే చేస్తానంతే! అలా కాక తగుదునమ్మా అని అవన్నీ నేను నిజజీవితంలో కూడా పాటిస్తే... ఫ్లాట్ ఫాం మీద పల్లీపకోడీ అమ్ముకోవాలి!" చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు ఆవదాలరావు.

అనుకున్నట్టే ఆవదాల్‌రావు కొద్దిరోజుల్లోనే విదేశానికి పోయాడు.

అదీ... ఇదీ...ఏదో టెక్నాలజీ అని లక్షల డాలర్లను ఖర్చు పెట్టి కొద్ది నెలల్లోనే కొడుకుని కనేసాడు. దాంతో అతని ఆనందం ఆకాశం తాకింది. సూటవ్వదని తెలిసినా సూటేసుకుని మీడియా తీసే ఫోటోలకి ఫోజులిచ్చి... ఆ తర్వాత విషయాన్ని వివరించి మరీ గొప్పగా చెప్పాడు.

అయితే ఈ విషయం అన్ని మీడియా సంస్థలతో పాటు విదేశీ వార్త సంస్థలు కూడా ప్రకటించడంతో, ఇతనితో సినిమా తీద్దామనుకున్న హాలీవుడ్ నిర్మాతలు, ఇలాంటి చిన్న మనస్తత్వం ఉన్న వ్యక్తికి అంత పెద్ద సినిమా ఇవ్వడం మంచిది కాదని, ఇలాంటి వివక్ష చూపడం ఒక బాధ్యత గల స్థానంలోని వ్యక్తి చేసే పని కాదని, వాళ్ళు సినిమాని ఇతనితో తీయడం లేదని విరమించుకున్నారు.

దాంతో ఆవుదాలరావ్ మొహం ఆవదం తాగినట్టు మారిపోయింది.

ఇంతలో నర్సు వచ్చి– "సార్ చిన్న తప్పు జరిగింది. మీకు పుట్టింది అబ్బాయి కాదు, అమ్మాయి. ఎక్కడో కోట్లలో ఒక్కసారి జరిగే ఎర్రర్ మీ విషయంలో జరిగింది... సారీ!" చెప్పింది చెవిలో.

దాంతో... 'అంటే రెండు విధాలుగా నష్టపోయానా ఖర్మ! ఈ నా పని నచ్చకే ప్రకృతి కూడా నన్ను వెక్కిరించింది... ఇపుడు కూడా మారకపోతే, నేను మళ్ళీ బస్టాండ్లో అప్పడాలమ్ముకోవాల్సిరావచ్చు.' అనుకుంటూ తన కూతురి వంక ప్రేమగా చూశాడు.

కథ

# సన్మాన వైరాగ్యం


డాక్టర్ రావెళ్ళ శ్రీనివాసరావు
9949330596

**పాపారావు వాకింగ్‌కి బయలుదేరడానికి బూట్లు తొడుక్కో బోతుంటే... ఓ లావుపాటి మనిషి గేటు తోసుకొని సరాసరి ఇంటి లోపలికి వచ్చాడు**

**ఆ వచ్చిన మనిషిని ఎగాదిగా చూశాడు.**

**ఎవరో గుర్తుకు రాక బుర్ర గోక్కున్నాడు. వేలిని పెదాలపై ఉంచి ఆశ్చర్యపోతున్నట్టు ఆకాశం వంక చూస్తూ 'ఎవరండీ మీరు? ఎవరు కావాలి?" అని అడిగాడు.**

వచ్చిన ఆ వ్యక్తి 'నమస్కారం పాపారావుగారు. నా పేరు మన్మధరావు. సన్మానాలు చేస్తుంటాను. ప్రతిభ ఎక్కడున్నా గుర్తించి ప్రోత్సహించడం మా ప్రత్యేకత. 'సన్మానాల శిఖరాన పాపారావు' అనే వార్తను నిన్నటి పేపర్లో చూసి వచ్చానండీ! మీకు సన్మానం చేసేదాకా నిద్ర పట్టేలా లేదు. మీ గురించీ, మీరు చేస్తున్న సేవల గురించి పేపర్లో చదవగానే ఒళ్ళు పులకించి పోయిందంటే నమ్మండి...మీరు ఒప్పుకుంటేనే ఇక్కడి నుండి కదులుతాను..." చేతిలోని స్వీట్ ప్యాకెట్లు, పండ్లు పక్కన ఉన్న టీపాయిపై పెడుతూ అన్నాడు మన్మధరావు.




"మన్మధరావు గారూ! కూర్చోండి! కూర్చుని మాట్లాడండి" అంటూ సోఫా చూపించాడు.

తాను కూడా మన్మధరావు ఎదురుగా మరో సోఫాలో కూర్చున్నాడు పాపారావు.

"ప్రజాసేవ చేస్తూ ఎంతో పేరు గడించారు.అందుకు ఈపాటికి ఏ వంద సన్మానాలో జరగాల్సింది. ఎనభై దాకా జరిగినట్టు పేపర్లో రాశా రనుకోండి. నిజానికి అవి తక్కువేననిపిస్తోంది."

"అసలు నాకు ఈ సన్మానాలంటే భయం వేస్తోందండీ!...ఆహ్వాన పత్రాలు పంచేటప్పుడున్న శ్రద్ధ సన్మానం చేయడంలో లోపిస్తోంది!... ఒకసారి కాకినాడలో ఏం జరిగిందో తెలుసా?..." అని పాపారావు అనడం ఆలస్యం...

"ఆ ఏం జరిగిందీ?" అని ముఖంలో ముఖం పెట్టి ప్రశ్నార్థకంగా అడిగాడు మన్మధరావు.

"ఏర్పాట్లన్నీ భారీగానే చేశారు....కానీ..." అనే లోగా–

"శాలువా తేవడం మర్చిపోయారా?" ఆత్రం ఆపుకోలేక అడిగేసాడు మన్మధరావు.

"లేదండీ! చిరుగుల శాలువా కప్పారు!" నీరసంగా పలికాడు పాపారావు.

"అయ్యయ్యో! ఎంత పొరపాటు చేశారు... కప్పే ముందు ఒకసారి చూసుకోవాలి కదండీ ఎవరైనా..."

"కొనేముందు బాగానే ఉందట!.. ఆరింటికి జరగాల్సిన సన్మాన కార్యక్రమం అర్ధరాత్రి పన్నెండు గంటలకు జరిగింది. శాలువాలున్న గదిలో డజన్ల కొద్దీ ఎలుకలున్నాయట. ఎలుకలు చేసిన ఘనకార్యం అది!...ఇలాగే వుంటాయండీ సన్మానాల్లోని విచిత్రాలు!" నవ్వుతూ పలికాడు పాపారావు.

"మేము మాత్రం ఎలాంటి పొరపాట్లు లేకుండా సన్మానం ఘనంగా చేస్తాం. కాశ్మీర్ శాలువా కప్పి, చేతిలో పండూ తాంబూలంతో పాటు తృణమో ఫణమో పెడతాంలెండి!" భరోసాగా అన్నాడు మన్మధరావు.

"ఒకసారి ఇలాగే రాజమండ్రిలో పూలతో పాటు రాళ్లు కూడా కలిపారు. ఇవిగోండి కావాలంటే అప్పటి గుర్తులు" అంటూ తలపై ఉన్న బొప్పెలు చూపించాడు పాపారావు విచారంగా.

'పొరపాటుగా పూలలో రాళ్లు కలిసాయేమో కానీ అంత దుర్మార్గానికి ఎవరు ఒడి కడతారు చెప్పండి?"సానుభూతిగా అన్నాడు మన్మధరావు.

"దానికి వాళ్ళు తర్వాత సంజాయిషీ చెప్పారు లేండి. పూలున్న గోనెసంచి జారీ కింద పడితే కిందనున్న రాళ్ళను కూడా గోనెసంచిలోకి ఎత్తే సరికి జరిగిన పొరపాటట అది."

"సరేలెండి పొరపాటు అని ఒప్పుకున్నాక వాళ్ల మీద తిరగబడతామా చెప్పండి... ఏదో జరిగి పోయింది... మేం మాత్రం మీకు ప్రత్యేకంగా

కారు పంపి... మిమ్మల్ని తిరిగి ఇంటికి చేర్చేదాక మాదే బాధ్యత. నమ్మండి!" అని పాపారావు చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు మన్మథరావు.

కాఫీ కప్పులతో ప్రత్యక్షమైన పాపారావు భార్య– "మనిషై పుట్టిన వారు తోటి వారికి సాయపడటం ఎక్కడైనా సహజమే కదండీ! ఈమాత్రానికే సన్మానం చేయాలా?" అంటూ కాఫీ అందించింది.


"మీరు వద్దంటున్నారు గానీ ఈ మధ్యన చీమల్ని దోమల్ని చంపిన వారికి కూడా సన్మానాలు చేస్తున్నారు. ప్రత్యక్షంగా మా ఎదుట ఉన్న పాపారావు గారికి సన్మానం చేయడం మా కనీస బాధ్యత!" అన్నాడు తడుముకోకుండా మన్మధరావు.

"సరే అలాగే కానివ్వండి!" అని ఒప్పుకున్నాడు పాపారావు.

"వచ్చే ఆదివారం తెనాలిలో సన్మానం తప్పక రావాలి!" అని చెప్పి బయలుదేరాడు మన్మధరావు.

గేటు దాకా సాగనంపి వచ్చాడు పాపారావు.

రెండు రోజులకు వాట్సాప్‌లో సన్మానానికి సంబంధించిన ఆహ్వాన పత్రం అందింది. పోస్ట్ చేసామని కూడా చెప్పారు.




ఆదివారం మధ్యాహ్నం నిర్వాహకులు పంపిన కారులో తెనాలి బయలుదేరాడు పాపారావు.

అనుకున్న సమయానికి పాపారావుకు ఘనంగా సన్మానం జరిగింది.

సన్మానం అయ్యాక తిరిగి ఇంటికి చేరేటప్పుడే చిక్కుల్లో పడ్డాడు.

వాళ్ళు ఏర్పాటు చేసిన కారు ఇంటి గొంది చివరిదాకా వచ్చి ఆగిపోయింది... అప్పుడు టైము అర్ధరాత్రి పన్నెండు గంటలు. చాలా సార్లు ట్రై చేసి ఇక కారు స్టార్ట్ కాదని డ్రైవర్ చెప్పేసరికి... శాలువా తీసి కప్పుకొని తనను మెచ్చుకుంటూ వేసిన దండల్ని మెడలో వేసుకున్నాడు. మొమెంటో చేత్తో పట్టుకుని కాలికి బుద్ధి చెప్పాడు.




సన్మానం జరిగిన విషయాలు భార్యకు పూసగుచ్చినట్టు చెప్పాలి కాబట్టి దండల్ని కూడా వెంట తెచ్చుకున్నాడు.

పర్లాంగు నడిస్తే గాని ఇంటికి చేరుకోలేడు.

పాపారావు వేషం చూసి... చిత్తు కాగితాలు ఏరుకునేవాళ్లు అని అనుకుందో ఏమో ఆ గొందికి మొదట్లో పడుకున్న కుక్క మొరగడం మొదలుపెట్టింది.

కుక్కను తోలుకుంటూ నడుస్తున్నాడు. దాని అరుపుకు పక్క గొందిలో ఉన్న కుక్కలు కూడా అరుస్తూ మొరగడం మొదలుపెట్టాయి.

ఇక లాభం లేదని నడక వేగం పెంచాడు.

ఆ కుక్కకు తోడు నాలుగైదు కుక్కలు తోడయ్యాయి...ఇక లాభం లేదని పరుగు లంఘించుకున్నాడు.

ఓ కుక్క తనను వెక్కిరిస్తున్నాడని అనుకుందో ఏమో, రెపరెపలాడుతున్న ఎర్ర శాలువాను నోటితో లాగి పారేసింది.

ఆ ఊపుకు ముందుకు పడబోయి తమాయించుకున్నాడు.

'పాడు శాలువా పోతే పోయిందని' దండల్ని గట్టిగా పట్టుకొని వడివడిగా నడుస్తున్నాడు.

ఆ దండలు ముఖానికి అడ్డొచ్చి దారి కనిపించకుండా చేస్తున్నాయి.

కుక్కలు అరుస్తూ తరమడం మాత్రం ఆపలేదు.

ఇంకొద్ది దూరం పరుగు పెడితే ఇల్లు చేరతాడనుకునే సమయంలో ఓ కుక్క నోటితో దండను పట్టుకుంది.

తమాయించుకుందామని చూసినా దాని ఊపుకు బ్యాలెన్స్ కుదరక దభీమని కింద పడ్డాడు.

వెంటనే పైకి లేచి చూసుకున్నాడు.

కాళ్లు బాగా దోక్కుపోయాయి.

దండలు దండిగా ఉండడం వల్ల ముఖానికి దెబ్బలు తగలకుండా ఆపాయి.

కుక్కలు "భౌ! భౌ!!" మనడం ఆపలేదు.

ఓ కుక్క పళ్ళన్నీ బయటపెట్టి... రెచ్చిపోతోంది.

'ఓహో దీనికి దండ కావాలి కాబోలు' అనుకుని మెడలోని దండ తీసి కుక్క మీదికి విసిరాడు. సరిగ్గా అది కుక్క మెడలో పడింది.

ఆ కుక్క "భౌభౌ" మని అరవడం ఆపి... "కుయ్ఁ...కుయ్ఁ" అనుకుంటూ పక్కకు వెళ్ళిపోయింది.

'క్రితం జన్మలో దీనికి బాగా సన్మానాలు జరిగుంటాయి. అందుకే తోకముడిచింది...' అనుకుని వెనక్కి తిరిగి చూశాడు.

ఇందాక శాలువా లాక్కెళ్లిన కుక్కకు మరో కుక్క తోడై శాలువాను చెరో వైపు నోటితో పీకుతూ కనిపించాయి.

మిగతా నాలుగు కుక్కలు పాపారావును తరుముతూనే ఉన్నాయి

"ఛీ.. ఛీ...పాడు కుక్కలు" వాటి అరుపుకు విసుగొచ్చింది.



వీధిలైట్ల వెలుగులో ఒక రాయి కనిపించే సరికి రాయిని చేతిలోకి తీసుకొని కుక్కల పైకి విసిరాడు.

అవి అరుపులు పెద్దవి చేసి పాపారావు పైకి ఎగబడి కరిచినంత పని చేశాయి.

అవి వదిలేలా లేవని మెడలో మిగిలిన దండలు తీసి వాటిపైకి కసితీరా విసిరేసాడు. ఆ కుక్కలు ఒక్కో దండను నోట కరుచుకొని, అరుపుల వేగం తగ్గించి అక్కడి నుండి వెనక్కి పరుగుతీశాయి.

'హమ్మయ్య!... ఎలాగో ఇల్లు చేరుకున్నాను.' అని గేటు తీసికొని ఇంట్లోకి వెళ్ళాడు.


పాపారావు ఆకారం చూసి భార్య–

"ఇదేంటండీ? ఈ బట్టల లేంటి? ఈ అవతారం ఏంటి? అసలు ఏం జరిగిందండీ?" అని అడిగింది.

కుక్కల విషయం చెప్పేసరికి చెయ్యి నోటికి అడ్డుపెట్టుకుని ఫక్కున నవ్వింది.

"నేను అనుకుంటూనే ఉన్నాను. నేను వెంట లేకపోతే ఏదో ఒకటి జరిగి తీరుతుందని... అందుకే అన్నారు మంచికైనా చెడుకైనా పక్కన ఒక తోడు ఉండాలని నేను అనుకున్నంత అయ్యింది. ఇంతకూ సన్మానం ఎలా జరిగింది?"

"సన్మానం గొప్పగా చేశారు.కానీ అబ్బా!... ఈ కాలి దెబ్బలే... అబ్బా!...అయ్యో..." కాలికైన గాయాన్ని చూసుకున్నాడు.




కారుతున్న రక్తాన్ని తుడిచి టింక్చర్ రాసి కట్టు కట్టింది భార్య. ఎప్పటికో నిద్ర పట్టింది. తెల్లారి పోయినా చలికి లేవబుద్ధి కాలేదు.

పాపారావుకు ఫోన్ వచ్చింది.

ఫోన్ తెచ్చి ఇచ్చింది భార్య.

"హలో పాపారావు గారేనా?"

"అవునండి పాపారావునే...."

'నా పేరు సుబ్బారావండీ....రాత్రి మీకు జరిగిన సన్మానం ఎంత అద్భుతంగా జరిగింది సార్! చూసేందుకు మాకు రెండు కళ్ళు చాలలేదు. అది చూడగానే మేము ఒక నిర్ణయానికి వచ్చేసాం..."


"ఏంటండీ అది?"

"కొత్తగా మేమొక అసోసియేషన్ ఏర్పాటు చేశాం... దాని తరఫున మొదటిగా మీకే సన్మానం చేయాలని రాత్రికి రాత్రే నిర్ణయించుకున్నాం. వచ్చే నెల ఐదవ తేదీ తెనాలిలో కార్యక్రమం ఉంటుంది.

"రాత్రి సన్మానం చేశారుగా!?... మళ్లీ ఎందుకండీ!"

"అయ్యయ్యో ఎంతమాట... ఎంతమాట.... వాళ్ళు చేస్తే మేము చేసినట్టు ఎలా అవుతుంది చెప్పండి? మా సన్మానం ఇలా ఇలా ఉండదు సార్... అంతకంటే ఘనంగా ఉంటుంది. ఏనుగు మీద అంబారీ పైన మీరు కూర్చుని ఉంటే, ఏనుగు వేదిక దాకా నడుస్తూ వస్తుంది. స్కూల్ పిల్లలు అటూ ఇటూ నిలబడి మీ మీద పూలు చల్లుతూ ఉంటారు... దాదాపు వంద కేజీల పూలు... మీరు కాదనకండి! మీ అంత ప్రతిభావంతులు... మంచి మనిషికి సన్మానం చేయడం నిజంగా మా పూర్వజన్మ సుకృతం.... ఒప్పుకోండి సార్!..." ప్రాధేయపడుతూ వేడుకొన్నాడు సుబ్బారావు.

"నాకు ఏనుగు సన్మానం వద్దు సార్! ఏనుగు కింద పడేస్తుందేమో... తొండంతో దూరంగా విసిరేస్తుందేమో.... నేను రాలేను సార్!... ఉంటాను సార్!.... నీరసంగా మూలుగుతూ ఫోన్ కట్ చేసేసాడు పాపారావు.




# నెల నెలా నవ్వుల వెన్నెల





**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- లింక్ ఫెయిల్యూయర్

నిర్వహణ: **లాల్**





















మీ బావకి లింక్ ఫెయిల్ అయి.....
ఉదయం నుండి బయటకు రావేదే చెల్లీ...
నిన్న నువ్వు తెచ్చిన మిర్చి బజ్జీలు
తెగ తినేశారు.. మరి...
TOILET
Omkar.


అవును నిజమే!...ఒకప్పుడు
తను నా గాళ్ ఫ్రెండే!...అయితే
ఈ మధ్యే మా మధ్య లింక్ ఫెయిల్యూర్
అయిందిలే!...
BUS STOP
రాగతి రమ



నీ ఫ్రెండ్ రమేష్ ని నాకు పరిచయం చేసావ్.
దీనితో మన మధ్య లింక్ సెపరేట్ అయింది
తెలుసా...


అమ్మా.. తల్లీ.. ఆయన తాళి కట్టాడో! లేదో! అర్థం కావట్లేదు..
ఎక్కడో లింకు కట్ అయినట్లుంది!!
ONLINE MARRIAGES


ఆఫ్టరాల్.. లిఫ్ట్‌లో ఒక వైరు లింకు
ఊడింది.. దీనికే ఇంత రాద్ధాంతం
చెయ్యాల్సిన అవసరం ఉందా?..
nagisetty


నా తప్పేముందా సార్? కనెక్టివిటీ ఫెయిల్యూరంతే!
ముందు సిస్టం ఫాస్ట్‌గా ఉంటే, సర్వీస్ ఫాస్టౌతుంది
CASH COUNTER


Link failure
INDIAN RAILWAYS


మన పార్టీలో నాయకులతో ఎక్కడో లింకు ఫైల్యూర్
అయ్యింది సార్. అందుకే అంతా
అవుట్ గోయింగే తప్ప ఒక్క
ఇన్కమింగూ లేదు
రాజకీయ పార్టీ

# సీతాకోకచిలుక

కథ

బొందల నాగేశ్వరరావు,
9500020101

**బి.టెక్.మూడవ సంవత్సరం చదువుకొంటున్న అన్నదమ్ములు రాజ్, రిషీలు గదిలో చెరో సింగిల్ కాట్లో పడుకొని నిద్రపోతున్నారు. రాత్రి పన్నెండు గంటల సమయాన అన్నరాజ్ నిద్రలోనే 'అహఁ... హాఁ...హాఁ' అని వెకిలిగా నవ్వుతున్నాడు.**

**ఆ శబ్దానికి టక్కున లేచిన తమ్ముడు రిషి భయపడుతూ అన్నయ్యకు దగ్గరగా వెళ్ళి–"ఒరేయ్ అన్నయ్యా!" అని గట్టిగా కదిపాడు. పళ్ళికిలిస్తూ లేచి కూర్చొన్నాడు రాజ్.**

**"ఏంట్రా!... ఏమైంది నీకు?... నిద్రలో అలా పిచ్చిగా నవ్వుతున్నావ్?" అడిగాడు తమ్ముడు.**

"కల్లో నా లవ్వరుతో నేను డూయెట్ పాడుకొంటున్నానురా! నన్ను నిద్ర లేపి బంగారం లాంటి కలను భంగం చేశావే! నిన్నూ..." దిండుతో కొట్టబోయాడు రాజ్.

"ఏహేఁ...అది కలేగా! నిజమైతే అస్సలు ఆగేవాడివి కాదేమో!"

"ఇప్పుడు కూడా ఆగన్రా!... నాకు నిజంగానే ఇద్దరు లవ్వర్లున్నారు తెలుసా?"

"ఇద్దరు లవ్వర్లా?" ఆశ్చర్యపోతూ అడిగాడు తమ్ముడు.

"అవున్రా!ఈ వీధి చివర్లో చిన్నారావని లేడూ...ఆడి ఇద్దరు కూతుర్లు నాకు లవ్వర్లు. బీటేసి కన్ను కొట్టేను. నవ్వులతో లైన్లో పెట్టాను!" అన్నాడు బ్రహ్మానందం స్టయిల్లో అన్నరాజ్.

రిషికి మైకం కమ్మి క్రిందపడి పైకిలేచి... "ఇద్దర్ని లైన్లో పెట్టావా! చిన్నది కూడా నీతో..."

"మరీ క్లోజ్! దానికి నిన్న ఓ లవ్ సింబల్ డాలర్ను ప్రెజెంట్ చేశా!" అని నవ్వాడు.

"అన్నయ్యా! ఎటూ ఇద్దర్ని లైన్లో పెట్టావు కనుక పెద్దదాన్ని కావాలంటే నువ్వు లవ్వాడేసుకో! చిన్నదాన్ని నాకొదిలేయరా!... ఈ మధ్యే దానికి కాలేజీలో నేనూ క్లోజ్ అవుతున్నాను!"

"సరే... ట్రై చేసుకో... అది నీకూ పడిపోద్దిలే! దానికి నేను డాలర్ను కొనిచ్చాను. నీకూ టెండరు పెట్టుద్ది. నువ్వు జాగ్రత్తగా వుండు!"

"ఆల్రెడీ ఐఫోన్ కావాలంటే తీసిచ్చానులే! ఆ తరువాతే నా చేతికి తన చేతిని అందించింది."

"సరేలే...గట్టిగా ప్రేమించి నీ దారికి తెచ్చుకో!... నేను దానక్కను మరీ గట్టిగా ప్రేమించి పెళ్ళికి రూటేసుకుంటా!" అని నవ్వాడు.

"అలాగే! అవునూ...దానక్క కూడా దీనిలా డబ్బు మనిషేనా?..." తమ్ముడు అడిగాడు.

"కాదు. అది ఒఠ్ఠి అమాయకురాలు. కాని నన్ను మాత్రం పిచ్చ పిచ్చగా ప్రేమించేస్తోంది." నవ్వుతూ దుప్పటి లాక్కున్నాడు రాజ్.

మరుసటి రోజు కాలేజీలో....

అమ్మాయిలు లాన్లో కూర్చొని వున్నారు. వాళ్ళలో చందన మెరిసిపోతూ కనబడింది రిషికి.

దగ్గరికి వెళ్ళి చిన్నగా నవ్వాడు. చందన ముంగురులను సర్దుకొని పెదాలపైకి నవ్వుతెచ్చుకొని– 'ఏమిటీ?' అన్నట్టు చూసింది.

"నీతో మాట్లాడాలి!"

"ఓకే!"అని వయ్యారంగా నడుచుకొంటూ దగ్గరి కొచ్చింది.

ఇద్దరూ బయటికి నడిచారు.

ఆటోని పిలిచి "ఎక్కు!"అన్నాడు రిషి.

ఆటోలో కూర్చొంటూ...

"ఎక్కడికీ?" అడిగింది చందన.

"బీచ్‌కి. అక్కడే డిస్ట్రబ్ లేకుండా బోటు చాటున కూర్చొని..."

"నీ తలను నా ఒల్లో పెట్టుకొని కబుర్లు చెప్పుకొంటూ... ఇంకేదో చేసుకోవచ్చనేగా! ఏయ్ దొంగా! అదేం కుదరదు. నువ్విచ్చిన సెల్ ఫోన్ను నేను తీసుకున్నాక నీలో బాగా ధైర్యం పెరిగిందే!" అని నవ్వింది.

ఆటో కదిలింది.

సాయంత్రం ఎనిమిదికల్లా ఆటోలో ఇంటి ముఖం పట్టారు.



చందనను వాళ్ళింటి దగ్గర దిగబెట్టి ఇంటికి వెళ్ళిపోయాడు రిషి. లోపల....

"మీరు చాలా ఫాస్టండీ! నెల రోజుల్లోనే నన్ను మీ వశం చేసుకున్నారు!" అంది అమాయకంగా వందన చేతికున్న వుంగరాన్ని ముద్దు పెట్టుకొంటూ.

"అదే నా టేలెంటు!...నేను ఇచ్చిన ఆ ఉంగరాన్ని ముద్దుపెట్టుకున్నావంటే నన్ను ముద్దు పెట్టుకున్నట్టేగా!"

"ఛీ!..." అని ఏదో చెప్పబోతుండగా దగ్గుతూ లోనికొచ్చాడు రిషి.


చూసి నవ్వుకొంటూ వెళ్ళిపోయింది వందన.

"అన్నయ్యా! ఏంట్రా వందన్ను పడగ్గది వరకూ తీసుకొచ్చావు. అమ్మా నాన్నలు చూస్తే?"

"వాళ్ళు రావటానికి పదవుద్ది.అందాకా బోరుకొట్టకుండా వందన్ను పిలుచుకున్నాను... పిలుస్తూనే వచ్చిందిరా పిచ్చిపిల్ల!" మెల్లగా నవ్వాడు.

"అది నీ అదృష్టం. దానికి అన్యాయం చెయ్యకురా పాపం!"

"నో! అదే నా భార్యని ఫిక్సయ్యా! అమ్మానాన్నను ఒప్పించి పెళ్ళి చేసుకుంటా! ఇంతకు ఇవాళ చందనతో ఎంజాయ్ చేశావా!?"



"అది చాలా ఘటికురాలురా బాబూ. చెయ్యి తనమీద వెయ్యనిస్తేగా! మగాళ్ళను ఇట్టే బోల్తా కొట్టించగలదు. సినిమాకు, తిండికి అయిదు వేలు బొక్క! ఇంకోసారి నాతో తను రావాలంటే పదివేలు తెమ్మంది. నాకు తెలీక అడుగుతున్నాను. మా ఇద్దరి మధ్య జరుగుతోంది లవ్వేనంటావా?"... సందేహంతో అడిగాడు తమ్ముడు.

"లవ్వో గివ్వో రేపు తేల్చేస్తాగా! అమ్మా నాన్నలు వచ్చినట్టున్నారు. పడుకో!" దుప్పటి లాక్కున్నాడు రాజ్.

ఏమీ అర్థంకాని పరిస్థితిలో లైటాపు చేశాడు రిషి.

ఉదయం ఎనిమిదిన్నరకల్లా కాలేజీలో ప్రత్యక్షమైయ్యారు అన్నదమ్ములు. గేటుకు లోపల లాన్లో వున్న బల్లమీద కూర్చొని కళ్ళల్లో వొత్తులు వేసుకొని చందన కోసం ఎదురు చూస్తున్నారు.

"ఏంట్రా చందన ఇంకా రాలేదు. సెలవు పెట్టిందేమో!"

"లేదురా! కచ్చితంగా వస్తుంది. ఇవాళ బైకులో మహాబలిపురానికి వెళ్ళాలన్నది మా ప్లాన్. షాపింగ్ చేయటానికి పదివేలు తెమ్మంది... ఏ.టి.ఎం లో డ్రా చేసి తెచ్చాను!" అన్నాడు రిషి.

అంతలో అటు వేపే వెళుతున్న వెంకట్ చూశాడు అన్నదమ్ములను.

"ఏంట్రా! బిత్తర చూపులతో గేటు వేపు చూస్తున్నారు. క్లాసుకు వెళ్ళరా?"

"మాకు కాస్త పనుంది!"అన్నారు అన్నదమ్ములిద్దరూ ఏక కంఠంతో.

"ఆ పనేంటో నాకు తెలుసులేండ్రా! మీ తపనంతా చందన్ను చూడాలనేగా! ఇటు రండి చూపుతాను" అని ఇద్దర్నీ కాలేజి గేటు బయటికి తీసుకు వెళ్ళి..."అదిగో చందన!"అని చూపుతుండగా...

ఆమె చంద్రూ బైకెక్కి సర్రున వెళ్ళిపోయింది.

"చూశారుగా!చందన ఓ బట్టంప్లై. డబ్బు పిశాచి. డబ్బును చూపితే ఎవరితోనైనా, ఎక్కడికైనా వెళుతోంది.అది ప్రేమనుకొంటే పొరపాటే! మీ ఇద్దరితో ప్రేమను నటించి లవ్‌డాలరు, సెల్ ఫోన్ను గిఫ్టుగా తీసుకొంది. కరక్టా!?"అడిగాడు సీనియర్ వెంకట్.

"అవును సార్!" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

నవ్వి "రెండునెల్ల క్రితం నాతో ప్రేమను నటించి బ్రాసెట్‌కి టెండరు పెట్టింది. జాగ్రత్త పడి సర్దుకున్నాను. ఇదిగో! నిన్నటి వరకూ మీరు. ఇవాళ ఆ చంద్రూగాడు. రేపెవడో?..." అంటూ సీనియర్ చెబుతూంటే చూస్తూ నిలుచుండి పోయారు అన్నదమ్ములు.



కథ

# క్రతువిధి

అభిమన్యు,
9440204748

**మన్మథరావుని 'మన్మథుడు' తెగ గోకుతున్నాడు. ఆ ఇచ్చింగ్ భరించలేక మన్మథరావు మనసు పరిపరి విధాలుగా పరుగులు తీస్తుంది. ఆ ప్రయత్నంలో అతని మనసుకి ఒక ఐడియా వచ్చింది. 'సహజీవనం'. 'ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది.' అంటారు కదా? మరి ఈ ఆలోచన మన మన్మథరావుని ఏం చేసిందో చూద్దాం!**

మనిషి తన సౌఖ్యం కోసం రకరకాల ఆలోచనలు చేస్తుంటాడు. అలా ఆలోచనల్లోంచి పుట్టిందే ఈ 'సహజీవనం'.

కూతురు ఎవరినైనా ప్రేమించి పెళ్ళి చేసుకుంటే తల్లిదండ్రులు ఒప్పుకోరు. 'పరువు పోయింది, పరువు పోయింది...' అని గగ్గోలు పెడ్తారు. ఆ అమ్మాయిని చంపేయడానికైనా సిద్ధపడతారు. అలాంటి తల్లిదండ్రులు కూతురు మరో వ్యక్తితో సహజీవనం చేస్తానంటే ఎలా ఒప్పుకుంటున్నారో అర్థంకాని ప్రశ్న...సమాధానం లేని ప్రశ్న.

ఈ సహజీవనం వలన ఒకరి మనసు ఒకరు తెలుసుకోవచ్చునంట! అభిప్రాయాలు, ఆశలు, ఆశయాలు, ఆవేశాలు తెలుసుకోవచ్చుంట! ఇవేవీ కలిసినా కలవకపోయినా శరీరాలు మాత్రం కలుస్తాయి.

మన్మథరావు నడవడికలో మార్పు వచ్చింది.

రోజూ షేవ్ చేసుకుంటున్నాడు...జుత్తుకు రంగు వేస్తున్నాడు. ఎక్కువ సేపు అద్దంలో చూసుకుంటున్నాడు. ట్రిమ్‌గా తయారయి ఆఫీసుకు వెళ్తున్నాడు. స్కూటర్ అమ్మి, మోటారు సైకిలు కొన్నాడు.

ఇదంతా అతని భార్య భాగ్యలక్ష్మి గమనిస్తుంది ఓకంట.

మన్మథరావుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్యను భాగీ... భాగీ... అని పిలుస్తాడు. ఎప్పుడూ భాగ్యలక్ష్మీ అని పిలవడు ఎందుకంటే అతనికి 'క్షి' పలకడం రాదు.

మన్మథరావు శక్తివంచన లేకుండా తెగ ప్రయత్నం చేస్తున్నాడు.

ఏదీ వర్కవుట్ అవట్లేదు. 'నీ ఫేస్‌కి అంత సీన్ లేదు...వెళ్ళవయ్యా వెళ్ళు...వెధవ వేషాలు వేయకు...' లాంటి రెస్పాన్స్ వస్తుంది.

ఒకరిద్దరు అయితే కొట్టడానికి కూడా వచ్చారు. మన్మథరావు సహనం చచ్చిపోతుంది....ఓపిక నశించిపోతుంది...మనస్సు అల్లకల్లోలంగా మారిపోతుంది...అట్టి తరుణంలో 'వెరైటీ మేరేజెస్ బ్యూరో' అతని ఆశలని చిగురింపజేసింది.


వెరైటీ మేరేజెస్ బ్యూరో ఆఫీసుకి వెళ్లాడు మన్మథరావు.

వాళ్ళు చెప్పేది విని ఆశ్చర్యపోయాడు. లోలోన ఆనందించాడు. అవేంటంటే... "...ఇక్కడ పెళ్ళిచూపులు ఉండవు. ఫోటోలు చూసి సెలెక్ట్ చేసుకోవటమే. వయస్సుతో సంబంధం లేదు. నచ్చితే పెళ్ళి మేమే చేస్తాం. ఇవన్నీ చాలా గోప్యంగా ఉంచుతాం. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడో కంటికి తెలియదు. దీనికి మీరు సిద్ధమైతే కొంత ఎక్కువ ఫీజు కట్టాల్సి ఉంటుంది..."

మన్మథరావు ఆనందం అంబరాన్ని తాకింది. ఇన్నాళ్ళకి తన కృషి ఫలించింది. తన ఆశలు, కోరికలు తీరే సమయం ఆసన్నమైందనే ఉత్సాహంతో వాళ్ళు అడిగిన ఫీజు కట్టేసాడు వేలల్లో.

తన పేరు నాగార్జున అని చెప్పాడు.

వాళ్ళు చూపించిన ఫోటోల్లోంచి తనకు నచ్చిన సినిమా స్టార్ రమ్యకృష్ణ పోలికలు గలిగిన ఒకామెను ఇష్టపడ్డాడు నాగార్జున అనే మన్మథరావు.




ఆ శోభనం గదిలో మన్మథుడు సినిమాలోని నాగార్జునలా ఉల్లాసంగా, ఉత్సాహంగా తిరుగుతున్నాడు మన నాగార్జున అనబడే మన్మథరావు.

తలుపు తోసుకుని లోనికి వచ్చింది రమ్యకృష్ణ.

ఆమె చేతిలో పాలగ్లాసుకి బదులు విస్కీ గ్లాసు ఉంది. రమ్యకృష్ణ ఓ మోస్తరుగా ఉంది. ఆమెను ఆంటీ అనాలో అమ్మాయి అనాలో అర్థం కాలేదు నాగార్జునకి. అయినా మనిషిని కాకుండా ఫోటో చూసి మెచ్చుకున్నాడు కదా!

"పాలు కాకుండా విస్కీ తెచ్చావేంటీ...!?"

"మీకు విస్కీ అంటే ఇష్టం కదా! అయినా

పాలగ్లాసు పాతబడిపోయింది. అందుకే ఇలా...” అంది రమ్యకృష్ణ.

“నీకెలా తెలుసు...!” అని విస్కీగ్లాసు అందుకుని పక్కనే ఉన్న టీపాయ్ మీద పెట్టాడు.

“మీ ఇష్టాయిష్టాలన్నీ తెలుసు...” అని రమ్యకృష్ణ అనగానే నాగార్జునకి ఏదో స్ఫురించింది లీలగా.


“అలాగా...” అని గుండ్రని ఆమె భుజాల మీద చేతులు వేసి తన గుండెలకి హత్తుకున్నాడు...తన్మయత్వంతో.

“బాగుందా...!” అని అడిగింది రమ్యకృష్ణ.

తుళ్ళిపడ్డాడు నాగార్జున.

మరుక్షణం ఆమెకు దూరంగా జరిగాడు. కాని, అప్పటికే నాగార్జున చెంప ఛెళ్ళుమంది.


“ఈ వయస్సులో వెరైటీలు కావాల్సొచ్చాయా? ఆ మన్మథుడు మీ మగాళ్ళనే గోకుతాడా!? ఆ రతీదేవితో మేమూ గోకించుకుంటాం. అప్పుడు తెలుస్తుంది మా ఇచ్చింగ్ ఎలా ఉంటుందో!... చూసి మీ మగాళ్ళు




తట్టుకోగలరా...?” కోపంతో అరిచినట్లుగా అంది భాగ్యలక్ష్మి.

“నన్ను క్షమించవే భా...భా...భాగలక్ష్మీ...” అని ఆమె కాళ్ళ మీద పడ్డాడు నాగార్జున అనబడే మన్మథరావు.

అంతవరకూ ‘క్షి’ పలకడం రాని మన్మథరావుకి ఈ దెబ్బకి భార్యను ‘భాగ్యలక్ష్మి’ అని పిలవడం వచ్చింది.



కథ

# దశమగ్రహం

పంతంగి శ్రీనివాస రావు
9182203351

**నడుస్తోన్న సంవత్సరానికి కొన్ని సంవత్సరాల అనంతరం ఒకానొక నెలలో, ఒకానొక రోజు ఉదయం...**

**కూరగాయల మార్కెట్ హడావుడిగా ఉంది.**

**చేతిలో చిన్న సంచితో ఆ మార్కెట్‌లోకి అడుగు పెట్టాడు ఆనందరావు.**

**తిన్నగా వెళ్లి కొద్దిగా కుప్పగా పరిచిన కూరగాయల వద్దకు వెళ్ళాడు.**

అది హోల్‌సేల్ మార్కెట్ అయినా, గిరాకీ ప్రకారం కూరగాయలు విక్రయిస్తుంటారు. మిగిలిపోయిన కూరగాయలు పాడయిపోతే, ఎంతో నష్టం భరించవలసి వస్తుంది. అందుకే, ఎక్కువ రేటువి తక్కువగా, తక్కువ రేటువి ఎక్కువగా అమ్ముతుంటారు.

ఆనందరావు గమనించనిది తనను రెండు కళ్ళు గమనిస్తున్నాయని, అతను క్రయం చేసే విధానాన్ని సెల్‌ఫోన్‌లో నిక్షిప్తం అవుతున్నాయని.

✦✦✦

కాలింగ్‌బెల్ సౌండ్‌కు తలుపు తీయగానే లోపలకు ప్రవేశించారు ఇద్దరు వ్యక్తులు.

"ఎవరు మీరు?" అసహనంగా అడుగుతున్న ఆ ఇంటి యజమాని ప్రశ్నకు వెంటనే స్పందించి...

"మీ పేరు ఆనందరావు కదూ!" అడిగారు.

"బయట నేమ్‌ప్లేట్ మీద ఉందిగా." యజమాని మాటల్లో వెటకారం.

జేబు నుంచి ఒక ఐడి తీసి చూపించి...

"మేము ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చాము" గంభీరంగా పలికారు ఆ ఇద్దరూ కోరస్‌గా!

" నేనేమీ మీకు బాకీ లేను... పన్ను చెల్లింపుల్లో నేను ప్రాంప్ట్!" చెప్పాడు ఆనందరావు.

అతడు కూర్చోమని చెప్పకుండానే... అక్కడ వున్న సోఫాలో కూలబడ్డారు ఆ ఇద్దరూ.

"ఫలాని రోజు మీరు కూరగాయల మార్కెట్‌కు వెళ్లారు కదూ!" అడిగాడు ఒకతను.

"అదేమిటి? అది పాకిస్థాన్ బోర్డర్‌లో లేదు కదా!"

ఆనందరావు వెటకారానికి ఒళ్ళు మండింది ఆ ఇద్దరికీ.

సెల్‌ఫోన్‌లో ఒక ఫోటో చూపించి...

"చూడండీ! ఇందులో ఉన్నది మీరే కదా?" అన్నాడు ఒకతను.

" అవును నేనే! నా ఫోటో ఎందుకు తీశారు?" అయోమయంగా అడిగాడు ఆనందరావు.

"ఆ విషయానికే వస్తున్నాం. మీరు ఆ రోజు మార్కెట్‌లో టమాటా, ఉల్లిగడ్డలు కొనుగోలు చేసారు. అవి ఈ రోజుల్లో కొనేది బాగా బ్లాక్ మనీ ఉన్నవారే! మీ వంటి సామాన్య ఉద్యోగులకు అది వల్లకాని పని. అందుకని మీ మీద అనుమాన పడవలసి వస్తోంది. మీరు బుకాయిస్తారని తెలుసు. అందుకే మీరు టమాటా, ఉల్లిగడ్డలు కొనుగోలు చేస్తున్నారు అనడానికి నిదర్శంగానే ఈ ఫోటోలు... అర్థమైందా?!" హుంకరింపుగా అన్నాడు ఒకతను.


అప్పటివరకూ వెటకారంగా మాట్లాడిన ఆనందరావు బిక్కచచ్చిపోయాడు.

"సార్... సార్! అర్థమయింది సార్.!" చేతులు కట్టుకుని వారి ముందు వినయంగా నిలబడ్డాడు.

"ఇప్పుడు చెప్పండి. ఒక గెజిటెడ్ ఆఫీసర్ సైతం కొనుగోలు చేయ సాహసించని వాటిని... ఒక సామాన్య క్లరికల్ స్థాయిలో నున్న మీరు కొనుగోలు చేసారు. మీ దగ్గర బ్లాక్‌మనీ ఉందని మేము అనుమానించడం సమంజసమే కదా?... మీరు నిజాయితీగా పన్ను కట్టేవారని ఇప్పుడు మేము భావించడం లేదు." కాలు మీద కాలు వేసుకుని ధీమాగా అన్నాడు మరొకతను.

చమట్లు పట్టసాగాయి ఆనందరావుకు.

నుదురు కొట్టుకుంటూ... "అంతా నా ఖర్మ సార్!" చెప్పాడు.



“ఏమిటి మీ ఖర్మ?... హౌసింగ్‌లోన్ ఇంట్రెస్ట్‌కు ఐటీలో మినహాయింపు ఉంది. ఈ మధ్య బ్యాంక్‌లు ఇటువంటి కాస్ట్‌లీ కూరగాయలు కొనడానికి లోన్లు ఇస్తున్నాయి. వీటికి మాత్రం ఐటిలో మినహాయింపు లేదు... మీరేమైనా దొంగ లెక్కలు చూపిస్తున్నారా?” గుచ్చి గుచ్చి అడగసాగారు

గుక్కతిప్పుకోనివ్వడం లేదు ఆనందరావును.

తిరిగి వారే... “ పెద్ద పెద్ద హోటళ్లలో సైతం ఉల్లిదోసెలు, ఉల్లి పకోడీలు వంటివి మెనూ నుంచి తీసి వేశారు... భోజన హోటళ్లలో టమాటాలతో కర్రీసేమీ చేయడం లేదు. ఎవరో ఇంటికి రెండు కార్లు ఉన్నవారు మాత్రం అప్పుడప్పుడు వాడే ఉల్లిగడ్డ, టమాటాలను... కేవలం డొక్కు స్కూటీ ఉన్న మీవంటి వారు వాడారంటే...” ఆగి...

“చెప్పండి! అసలు మీ ఆదాయం ఎంత? ఖర్చెంత??” నిగ్గతీసారు.

వారి మాటలకంటే... అదేదో సినిమాలో చూపించిన ‘థర్డ్ డిగ్రీ’ నే నయమనిపించింది ఆనందరావుకు.

చేతులు పైకెత్తి నమస్కరించి... ఏడుపు గొంతుతో చెప్పాడతను.

“సా...ర్! ఆపండిసార్! అంతా నా ప్రారబ్ధం సార్! తొమ్మిది గ్రహాల నుంచైనా విముక్తి కావొచ్చు కానీ, దశమ గ్రహం నుంచి మాత్రం విముక్తి కాలేము సార్...” అంటూ వారి ముందు గుండ్రాలు తిప్పాడు.



“మొన్న వచ్చి వెళ్ళిన పండుగకు బుద్ధి గడ్డి తిని మా అమ్మాయిని పిలిచాము సార్.. అమ్మాయితో పాటు అల్లుడు కూడా వస్తాడుగా..” చెపుతూ ఫ్లాష్‌బాక్‌లోకి తను వెళ్లి, ఆ ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్లను కూడా లాక్కెళ్లాడు ఆనందరావు.

✦✦✦

“ బాగున్నారా, నాన్నా!”అంటూ లోపలకు ప్రవేశించింది ఇందుమతి.

“నమస్తే, మామయ్యా! బాగున్నారా?” అంటూ వెనకనే ప్రవేశించాడు భాస్కర్.

“భాగ్యం! అమ్మాయి, అల్లుడు వచ్చారే!” అంటూ గట్టిగా కేక పెట్టాడు ఆనందరావు

“వస్తున్నా!” అంటూ పైట కొంగుకు చేతులు తుడుచుకుంటూ వచ్చి పళ్ళన్నీ బయటకు పెట్టి నవ్వుతూ పలకరించింది భాగ్యం కూతుర్నీ, అల్లుడినీ.

“ఏదయినా టిఫిన్ చెయ్!” భార్యతో చెప్పాడు ఆనందరావు.

“అబ్బా! అంత ఘనంగా మీరు చెప్పాలా, చిటికెలో తయారు చేయనూ ఉప్మా...” అంటూ వంటింట్లోకి దూరింది భాగ్యం.

డైనింగ్ టేబుల్ మీద కూర్చుని, ఉప్మా సేవిస్తోన్న అల్లుడి ముఖ కవళికలు అదోలా మారటం గమనించక పోలేదు ఆనందరావు.

మధ్యాహ్నం వేళ భాగ్యం వంటింట్లో ఉంది.

వసారాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు ఆనందరావు.

మెల్లగా వచ్చి, తండ్రికి ఎదురుగా కుర్చీని లాక్కుని కూర్చుంది, ఆనందరావు గారాల పట్టి ఇందుమతి.

“నాన్నా!” పిలిచింది మెల్లగా.

పేపరు నుంచి తలెత్తి ...

“ఏంటమ్మా!” అడిగాడు జారిన కళ్లద్దాలు నుంచి చూస్తూ ఆనందరావు.

“ఆయన చాలా అసంతృప్తిగా ఉన్నారు నాన్నా!”

“ఏమయిందమ్మా? ఏమయినా లోపాలు జరిగాయా?”

“ఎప్పుడో పండుగకు ఒకసారి వచ్చే అల్లుడికి ఉప్మాపెట్టడం నచ్చలేదు నాన్నా!”

"మరేం చేయమంటావు అమ్మా!"

"ఏదయినా మంచి రుచిగా ఉండేట్టు ఉల్లి పకోడీనో, దట్టంగా ఉల్లిపాయలు వేసిన పెసర గారెలో..." ఆమె చెప్తూనే ఉంది.

"అమ్మా! ఇందూ... " గట్టిగా కేక వేశాడు.

ఆ అరుపుకు వంటిట్లో నుంచి బయట కొచ్చింది భాగ్యం కంగారుగా

"ఏమయిందండి?" అంటూ...

"చూడవే... మన ఇందు మన స్తోమతకు మించిన కోరికలు కోరుతోంది." చెప్పాడు.

"నేనేం కోరానని... ఉల్లిగారెలు, ఉల్లి పకోడీలు అడిగాను. ప్రతి కూరలో టమాటా మిక్స్ చేయందే మీ అల్లుడు గారికి ముద్ద దిగదు." ముక్కు ఎగబీల్చింది ఇందుమతి.


"చూడు భాగ్యం!... టమాటా కూడా అంటోంది." చెప్పాడు ఆనందరావు భార్యకు.

చేతులు పైట కొంగుకు రాసుకుంటూ...

"అదేంటి ఇందూ! మీ నాన్నగారు గవర్నమెంట్ ఆఫీసులో పై సంపాదన లేని చిన్న ఉద్యోగి. అది మరిచావా?" అన్నది భాగ్యం.

"అదలా ఉంచు భాగ్యం!" అంటూ కూతురు వేపు తిరిగి..."చూడు ఇందూ!నువ్వు, అల్లుడు గారు పండగకు ఇంటికి వచ్చారు. సంతోషం! కావాలంటే ఏదేని కానుక కోరుకుంటే వాయిదాలు కట్టి ఆ కానుకను మీకు ఇస్తాను... అంతేగానీ..." ఆగాడు.

" పో! నాన్నా! నువ్వు మరీను! బోడి కానుక ఎవరికి కావాలి? మా ఇంటి నిండా ఫర్నిచర్ ఉంది. నోరు చచ్చి ఆయన ఉన్నారు. ఆయనను అసంతృప్తి పరుస్తారా?.. ఆ ఎఫెక్ట్ నా మీద పడుతుంది." అరిచింది ఇందుమతి.




తల పట్టుకుని లేచిన ఆనందరావు, షర్ట్ తగిలించుకుని బయటకు వచ్చాడు.

నేరుగా... కాబూలీవాలాకు ప్రతిరూపం అయిన కాంతారావు ఇంటికి వెళ్ళాడు.

కాంతారావు తన కొలీగ్... పైగా పరమ పిసినారి.

ఆనందరావును చూడగానే అర్థం అయింది కాంతారావుకు. ఎందుకంటే, తన ఇంటికి మొహం వేలాడేసుకుని ఒక వ్యక్తి వస్తున్నాడంటే అతనికి అంతా అర్థం అవుతుంది.

"నేనేమైనా నీకు సహకరించగలనా?..." పళ్లికిలిస్తూ ఎదురొచ్చాడు కాంతారావు

రాని చిరునవ్వును బలవంతంగా రప్పించుకున్నాడు.

"నా టర్మ్స్ అండ్ కండిషన్స్ తెలుసుగా!" అవసరం ఎదురువాడిది.

అతడిని చూస్తే మందుకొస్తున్నా... ఈ సమయంలో ఆదుకునే దైవదూత.


ఫార్మాలిటీస్ పూర్తి చేశాక– "నీ బాకీని సాధ్యమైనంత త్వరలో తీరుస్తాను. ప్రావిడెంట్ ఫండ్‌లోన్ పెడదామని అనుకుంటున్నాను. అది రాగానే..." అంటోన్న ఆనందరావుకు అడ్డు వచ్చి... "ఛ! అంత తొందరేం వచ్చింది? నిదానంగానే తీర్చుదువు గానీ..." అభయమిచ్చాడు కాంతారావు.

'నీ ముల్లెం పోయింది.. ఎంత లేటు అయితే అంత వడ్డీ వస్తుంది..' మనసులో కసిగానే ఉంది.

విధి వైపరీత్యం... కూతురు పెళ్లికి కూడా ఎవరి ముందూ చేయి చాపలేదు. అల్లుడి విపరీత కోరికలు తీర్చడానికి కాంతారావుగాడి ముందు నిలబడవలసి వచ్చింది.

ఎంతో వైరాగ్యం ఆవరించింది... తన పేరును తలచుకుంటే తన మీద తనకే 'జాలి' కలుగుతోంది. మార్కెట్లో పెరిగే ధరలకు నోరు కట్టుకుని భార్యతో బ్రతుకుతున్నాడు ఆనందరావు. పండగ పేరిట అల్లుడు వచ్చాక అతని సంతోషం ఆవిరి అయింది.

✦✦✦



'సుయ్.. సుయ్..' కిచెన్ లో గుబాళింపుకు చాలా కాలం తర్వాత... నోరు ఊరుతోంది ఆనందరావుకు. కానీ, తీర్చవలసిన అప్పు గుర్తుకు వస్తే... అతని జిహ్వా చాపల్యం అణచి వేసుకునేలా చేసుకుంటున్నాడు.

ఒక బేసిన్ నిండా ఉల్లి పకోడీలు పట్టుకుని, ఒక చేతిని పైట కొంగుకు తుడుచుకుంటూ..

"టిఫిన్ రెడీ!" అంటూ డైనింగ్ దగ్గరకు వచ్చింది భాగ్యం.

గరం గరం పకోడీలు ఆబగా తింటోన్న అల్లుడిని చూస్తూ– వెర్రి నవ్వు ఒకటి పులుము కున్నాడు తన మొహాన ఆనందరావు.

"అత్తయ్యా! పకోడీలు చాలా బాగున్నాయి." అల్లుడి హార్ట్ ఫుల్ పొగడ్తలకు మురిసిపోతున్న పిచ్చి భాగ్యాన్ని అలాగే చూస్తూ ఉండిపోయాడు ఆనందరావు.

"అమ్మా! రేపు పెసర గారెలకు పప్పు నాన బెట్టు. ఆఁ! ఉల్లి గడ్డలు మరి కాసిని వేయమ్మా. అన్నట్టు ఈ రోజు మెంతికూర పప్పులో టమా టాలు బాగా కలపాలి." కోర్కెల చిట్టా విప్పు తోంది ప్రియ పుత్రిక ఇందుమతి.

అలా నాలుగు రోజులు కరవు తీరా జిహ్వా చాపల్యం తీర్చుకున్న తర్వాత...


ఆ సాయంత్రం తల్లిదండ్రులకు చెప్పింది ఇందుమతి.

" అమ్మా.. నాన్నా! మేము రేపు వెళదామని అనుకుంటున్నాము... సాయంత్రం అయిదు గంటలకు ట్రైను ఉంది." అని.

## ఈ నెల 'దినం'

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం -ఫిబ్రవరి,12






"సంతోషం తల్లీ!..." ఎంతో హుందాగా చెప్పాడు ఆనందరావు.

"అదేంటీ మరో రెండు రోజులు...." అంటోన్న భార్యకు అడ్డు వచ్చి...

"పోనీలే వెళ్ళనివ్వు భాగ్యం! అల్లుడుగారు మళ్ళీ ఆఫీసుకు వెళ్ళాలి. వాళ్లకూ పనులు ఉంటాయి. ఇల్లు సర్దుకోవాలి." అన్నాడు ఆనందరావు.

"నాన్నా! మా ఇంటికి మార్కెట్ చాలా దూరం. అయినా, అక్కడ ఇంతమంచి క్వాలిటీవి దొరకవు. రేపు ఉదయం నాలుగు కెజీల టమాటాలు, రెండు కిలోల ఉల్లిగడ్డలు తెస్తే, తీసుకెళతాం!" కూతురి మాటలకు నిర్వేదంగా మరో లోకంలోకి వెళ్ళిపోయాడు ఆనందరావు.

"ఇప్పుడు చెప్పండి సార్! నేను ఆర్థిక నేరస్తుడినా? నా మీద ఏ సెక్షన్ ప్రయోగిస్తారు." ఇహంలోకి వచ్చిన ఆనందరావు ధైర్యంగా తన ఎదురుగా కూర్చున్న వారిని అడిగాడు.

"ఏమేవ్! ఓ చెంబుడు నీళ్ళు పట్రా..." అరిచాడు.

భర్త అరుపులకు కిచెన్ నుండి పైట కొంగుకి చేతులు రాసుకుంటూ ఆఘమేఘాల మీద అక్కడకు వచ్చింది భాగ్యం.

అక్కడి పరిస్థితులను చూసి నోరు తెరిచినా, క్షణంలో తేరుకుని–

"అయ్యో! వీరిని స్పృహలోకి తేవాలంటే ఒక చెంబుడు కాదు... రెండు చెంబులు కావాలి!" అంటూ కిచెన్‌లోకి వెళ్ళ బోయింది.

"నీ మొహం! నువ్వు కిచెన్‌లోకి వెళ్లి వచ్చే సరికి లేటు అవుతుంది. అదుగో, ఆ డైనింగ్ ప్రక్కనే కుండ వుంది. ఆ చల్లటి నీళ్ళు తీసుకు రా!" ఆర్డర్ జారీ చేశాడు ఆనందరావు.



కథ

# అతి రహస్యం బట్టబయలు

కాశీ విశ్వనాథం పట్రాయుడు
9494524445

**"ఏవండీ ఇవాళ షాపింగ్‌కి వెళ్ళాలి మర్చిపోయారా? ఏంటి?" అంది తాయారు.**

"మర్చిపోతే నన్ను బతకనిస్తావా?" అన్నాడు భర్త కుంభకోణం.

"ఉన్నదంతా ఆర్వేయ్ సీరియల్లో హీరోయిన్ కొత్త నగ వేసుకుందండీ మరి నేను వేసుకోవద్దా?" అని గోముగా అడిగింది తాయారు.

"ఇంట్లో పది బీరువాల్లో చీరలు, నగలు ఉన్నాయి వాటితో సరి పెట్టుకో బంగారం!" అన్నాడు ప్రేమగా.

"తిన్న కడుపుకే ఆకలెక్కువ' అన్నట్లు ఇంట్లో ఎన్ని నగలున్నా కొట్లోకి వచ్చిన కొత్త నగే కొట్టొచ్చినట్లు కనపడుతుంది!" అంది తెలివితక్కువ తాయారు.

'చేసుకున్న మగడా అనుభవించరా!' అనుకుంటూ... భార్యతో షాపింగ్‌కి బయలుదేరాడు కుంభకోణం.



షాపులోకి వెళ్తూనే "ఉన్నదంతా ఆర్వేయ్ సీరియల్లో హీరోయిన్ వేసుకున్న నగలు, నిన్ను తగలెయ్య సీరియల్ లో అత్తగారు వేసుకున్న నలభై తులాల నాజూకు నక్లెస్ చూపించండి" అంది.

"సరే" నంటూ రకరకాల నక్లెస్లు చూపించారు.

అవన్నీ మెడలో వేసుకుని, అద్దంలో చూసుకుని...

ఓ నాలుగు గంటల తరువాత రెండు నక్లెస్‌లు ఎంచుకుంది.

ఆ తరువాత బట్టలు, వగైరాలు కొనుకుని సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు.

కాసేపటి తర్వాత ఇంటికి ఇద్దరు వ్యక్తులు వచ్చి- "మేం ఇన్‌కమ్ టాక్స్ అధికారులం. మేం కొన్ని వివరాలు అడుగుతాం చెప్పండి!" అన్నారు ఐడెంటిటీ కార్డు చూపిస్తూ.

"దానికేం భాగ్యం! నన్ను అడగండి టకటకమని చెప్పేస్తా!" అంది తాయారు.

"మీ దగ్గర ఉన్న బంగారం, నగదు, స్థిరాస్తుల వివరాలు చెప్పండి?" అని అడిగారు.

తాయారు చెప్పబోతూ ఉండగా... "వద్దు! చెప్పకు!!..." అని సైగ చేశాడు భర్త కుంభకోణం.

"అమ్మ పెట్టాపెట్టదు అడుక్కు తినానివ్వదు. అన్నట్లు నువ్వు చెప్పవు, నన్ను చెప్పనివ్వవు" అని సణుగుతు బీరువాలో ఉన్న నగలన్నీ అధికారికి చూపించింది. ఎక్కడెక్కడ ఇళ్ళ స్థలాలు ఉన్నాయో వివరాలన్నీ చెప్పింది. ఇనప్పెట్టెల్లో దాచి ఉంచిన నోట్ల కట్లను వారికి చూపించింది తెలివి తక్కువ తాయారు.

ఆ వివరాలన్నీ రాసుకుని- "మీరు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారు. కాబట్టి ఈ ఆస్తుల వివరాలు పై అధికారులకు నివేదిస్తాం." అని చెప్పి బంగారునగలు, నగదు పట్టుకుని పరారయ్యారు ఆ ఇద్దరు వ్యక్తులు.

కాసేపటి తరువాత వారు దొంగలని తెలిసి కన్నీరు మున్నీరుగా విలపించింది తెలివితక్కువ తాయారు.

"నీ మెదడు మోకాల్లో ఉంది. అతి రహస్యం బట్టబయలు అంటే ఇదేనే. నేను ప్రతీ ఒక్కరి దగ్గర లంచం తీసుకుని కూడబెట్టిన సొమ్మును, 'కుంచమ్మ కూడ బెడితే... మంచమ్మ మాయం చేసిందనట్లు... బంగారాన్ని దొంగలపాలు చేసావు." అని లబోదిబోమన్నాడు కుంభకోణం.

మోకాల్లో మెదడు ఎక్కడ ఉందా అని వెత కడం ప్రారంభించింది తెలివి తక్కువ తాయారు.

అలా అప్పటినుంచి... అతిరహస్యం బట్ట బయలు అనే సామెత వాడుకలోకి వచ్చింది.

# బ్లేడుతో పెన్సిల్ చెక్కుకోవాలి... చెయ్యి కోసుకో కూడదు!

'హాస్యానందం' జనవరి 2025 సంచిక AI మీద గురిపెట్టింది. అందులో కార్టూన్లు, కథలు చూసి, చదివి నా అభిప్రాయం తెలియ చేయాలని ఈ ప్రయత్నం.

ఆదిమ మానవుడు సహజసిద్ధ గుహలలో బొమ్మలు వేసిన 'మేధ'(ఇంటలీజెన్స్)ని తరువాత తరానికి పంచితే... తరువాతి తరం దేవాలయ గోడలమీద వారిచేత తొలచబడిన గుహలలో చక్కటి రంగుల చిత్రాలు వేసి... ఆ తరువాత తరానికి మార్గదర్శకులయ్యారు.

ఈ 'మేధ' (ఇంటలీజెన్స్)ని అందుకుని నాగరికుడు గోడల స్థానంలో కాగితం, గుడ్డ, మరియు రకరకాల రంగులను వాడాడు.

మెదడు ముడతలు పడుతూ పెరిగింది.

వాటి కారణంగా రకరకాల 'ఇజమ్'లు కాన్వాస్ మీద కూర్చున్నాయి. ఇప్పుడు ఈ 'నవ' నాగరికుడు తన 'మేధ'ని 'ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్' తో అనుసంధించాడు.

ఆ మధ్య మహాబలిపురంలో శిల్పాలు అమ్మే షాప్‌కు వెళ్ళి ఒక 'వినాయకుడి' విగ్రహం చూసి ఆశ్చర్యంతో ఆనందపడిపోయి చివరకు బేరం తెగక ఇంకో కొట్టులోకి వెళ్ళా.

ఇక్కడ ఇంకోరకం ఆశ్చర్యం! అక్కడ కూడా అదే రకమైన విగ్రహం... కానీ ధర చాలా తక్కువ! అదెలా?... అప్పుడు తెలిసింది విగ్రహాలను కూడా యంత్రాలు చెక్కి పడేస్తున్నాయని. అంటే అరుదుగా దొరికేవి అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఏదయినా ఒక్కటే వుంటే దాని విలువ ఎక్కువ. ఇండస్ట్రియల్ రివల్యూషన్ ద్వారా మాస్‌ప్రొడక్షన్ సాధ్యమయ్యి వస్తు విలువ తగ్గిపోయింది... ఒక పెయింటింగ్ ఖరీదు ఎక్కువ. అదే పెయింటింగ్‌ని ఫోటో తీసి ప్రింట్ చేసి,కాపీలు వేస్తే దాని విలువ లేశ మాత్రమే.

ఇక్కడే కంప్యూటర్, ఫోటోషాప్, ఇలాంటివి ఎన్నో అందుబాటులోకి వచ్చి... పెయింటింగ్‌ని ఇవి రీప్లేస్ చేయలేకపోయినా పబ్లిషింగ్ రంగంలో విపరీతమయిన మార్పులు తెచ్చాయి. చక్కగా బొమ్మలు వేయటం దానికి చక్కటి రంగులు వేయడం... అప్పటికప్పుడు యూజర్‌కి పంపించడం సాధ్యమయింది. కానీ ఎక్కడా చిత్రకారుడు రీప్లేస్ చేయబడలేదు. ఇది పరిమితమయిన AI వాడుక.

ఇక అపరిమతమయిన AI వచ్చింది... AI సాఫ్ట్‌వేర్‌లు ఎన్నో వచ్చి పడ్డాయి. దీనికి మనం 'ప్రాంప్ట్' ఇవ్వటమే. వివరంగా AI కి చెబితే మనం ఎలా కావాలంటే అలాగా తక్కువ సమయంలో మన ముందు 'గీసి పడేస్తుంది.' నచ్చలేదా కొద్దిగా మార్చమని అడిగితే అది కూడా క్షణాలలో గీసి మనముందు పడేస్తుంది.


ఇక్కడే పూర్తిగా కార్టూనిస్ట్ రీప్లేస్ చేయబడ్డాడు. దానికి బదులు 'సమాధి' చేయబడ్డాడు అనవచ్చా?..

అంటే కొత్తరకం ఉద్యోగాలు వస్తాయి. ప్రాంప్టిస్టులు వస్తారన్నమాట!


కాబట్టి కార్టూనిస్టులు AI గీసిన బొమ్మలను స్టడీ చేస్తూ ఆ స్కెచ్, పర్‌స్పెక్టివ్, కలరింగ్ వంటివి స్కిల్స్ పెంచుకోవాలి.

AI ని గురువుగా గుర్తించాలి.

మన వర్కు యునిక్ వర్క్‌గా మలుచుకోవడానికిAIని ఉపయోగించాలి!




ఇక్కడ కార్టూనిస్టు పని కేవలం ఇలా... అలా... అని చెప్పటమే. ఇక కాగితం, పెన్సిల్, ఎరేజర్, ఇండియన్‌ఇంక్, టాబ్లెట్స్‌తో పని లేదు. అసలు 'కార్టూనిస్టు' అవసరం కూడా లేదు. కాస్త హాస్య చతురత వుంటే చాలు. ఎవరయినా AI నుండి రిజల్ట్ రాబట్టవచ్చు.




బ్లేడుతో పెన్సిల్ చెక్కుకోవాలి గానీ చెయ్యి కోసుకోకూడదు కదా?!

చివరగా 'టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్, ఆర్.కె.లక్ష్మణ్ గారిని పిలిచి AI లో కార్టూన్లు వేయమంటాడా?...పోని తానే AIలో కార్టూన్లు వేసి, ఆర్.కె.లక్ష్మణ్ గారిని 'ఇక మీ సర్వీసెస్ చాలు' అని అంటాడా? ఆలోచించాలి. అసలు దాని అవసరం ఎందుకొచ్చిందని!

నా దృష్టిలో గర్భగుడిలోని విగ్రహానికి, పందిళ్ళలోని వినాయకుడి విగ్రహానికి ఉన్న తేడా...AIకి మనం వేసిన చిత్రాలకి ఉన్న తేడా!

కొసమెరుపు: హాస్యానందం రాముగారికి AI మీద అవగాహన లేకుండా ఉండుగాక! కార్టూనిస్టులను, ఆర్టిస్టులను ఆదరించు గాక!

**-ఎ.మురళీధర్,** కార్టూనిస్ట్, జాగృతి

# నవ్వులాట



గాంధీ మనోహర్, 98490 51846

## ఆ పెన్‌డ్రైవ్ లో ఏముంది?

**కొంతమంది తాము చేస్తున్న పని తప్పని తెల్సుకోలేక ఏదో క్రేజీగా చేస్తారు. అలాగే దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో కూడా ముందుగా అంచనా వేయ లేరు. తర్వాత దాని వల్ల ఎంత నరకం అనుభవించాలో అంతా అనుభవిస్తారు. అలాంటి ప్రబుద్ధులకు ఒకసారి ఆ అనుభవమేదో పర్సనల్‌గా 'టేస్ట్' చేస్తే గానీ బుద్ధిరాదు.**

ఈ కథలో కథానాయకుడు లింగబాబుది కూడా ఆ టైప్ క్యారక్టరే. కాబట్టి ఆయన గారికి కూడా అలాంటి సంఘటనే ఎదురయింది... అదేంటో ఓ లుక్కేద్దాం.

✦✦✦

లింగబాబు కొలీగ్ అయిన పవిత్ర. ఆమె తన ఇంట్లో వున్న పర్సనల్ కంప్యూటర్ కరప్ట్ అవడం వల్ల అందులో వున్న తన ఫోటోలన్నీ డిలీట్ అయిపోయాయనీ, తను వాటిని పెన్ డ్రైవ్‌లోనో లేదా హార్డ్‌డిస్క్‌లోనో కాపీ చేసుకుని వుండాల్సిందని బాధ పడుతూ లింగబాబుతో చెప్పుకుని వాపోయింది.

పై ఇన్సిడెంట్ జరిగిన నాలుగు రోజుల తర్వాత లింగబాబు టెన్షన్‌గా వుండడం గమనించి కారణం అడుగింది పవిత్ర.

"నిన్న మా ఫ్లాట్‌లో షార్ట్ సర్క్యూట్ అయి మా టీవీ పేలిపోయింది.

" అయ్యో! ఎప్పుడు కొన్నారు? దాని కాస్ట్ ఎంత? వారెంట్ పిరియడ్‌లో వుందా?" అని మళ్ళీ మళ్ళీ అడక్కుండా అన్ని ప్రశ్నలూ ఒకే సారి అడిగేసింది.

"టీవీ గురించి నాకు బాధలేదండి!...' అన్నాడు లింగబాబు.

"మరి?!"

టీవీ పేలిన శబ్దం విని మా అపార్ట్‌మెంట్‌లో వున్న చాలామంది మా ఫ్లాట్‌కు వచ్చారట!"

"ఓ.. వచ్చిన వాళ్ళు ఏమైనా వ్యాల్యుబుల్ ఐటమ్స్ తీసుకుపోయారా?"

"ఔను! ఓ పెన్‌డ్రైవ్‌ని ఎవరో తీసుకుని పోయారు!" అని అన్నాడు లింగబాబు.

"ఆ పెన్ డ్రైవ్ కాస్ట్ ఎంత?"

"మూడు వందలు!"

"ఏంటండీ!... వేలల్లో విలువ చేసే టీవీ పోయినందుకు బాధ పడకుండా.. ఆ ముష్టి పెన్ డ్రైవ్ గురించి చెప్తున్నారు?"




"ఆ పెన్‌డ్రైవ్ కాస్ట్ మూడువందలే కానీ అందులో వున్న వీడియో ఫుటేజీ.." అని ఏముందో చెప్పలేక ఆగి పోయాడు.

"ఏముందీ అందులో? ఇంకా రిలీజ్ కానీ స్టార్ హీరోల సినిమాలు ఏమైనా ఉన్నాయా?" అని కూసింత ఎగతాళిగా అంది.

అందులో ఏముందో చెప్పడానికి గిల్ట్ ఫీల్ అవుతూ చివరికి చెప్పాడు లింగబాబు.

" నేను నా భార్యకు తెలియకుండా శోభనం గదిలో జరిగిన రొమాన్స్‌ని సీక్రెట్ కెమెరాతో రికార్డ్ చేశాను... దాన్ని కొన్నేళ్ళ తర్వాత ఎప్పుడైనా నా భార్యకు చూపించి సర్ప్రైజ్ చేయాలనుకున్నాను...ఆ వీడియో ఫుటేజీని ఇన్నాళ్ళూ నా పర్సనల్ కంప్యూటర్‌లో కాపీ చేసి జాగ్రత్తగా పెట్టుకున్నాను. నీ కంప్యూటర్ కరప్ట్ అయినట్టే నా సిస్టం కూడా పాడైపోయి అందులో వున్న... మా 'శోభనం రొమాన్స్' వీడియో ఫుటేజీ కూడా నాకు దక్కకుండా పోతుందేమోనని అనుమానించి దాన్ని ఓ పెన్ డ్రైవ్‌లోకి కాపీ చేసి పెట్టుకున్నాను. టీవీ పేలిన ఇన్సిడెంట్ తర్వాత ఆ పెన్‌డ్రైవ్ ఇప్పుడు కనిపించడం లేదు. వచ్చిన వాళ్ళల్లో ఎవరో దాన్ని తస్కరించినట్టున్నారు" అని బేలగా అన్నాడు.

'ఆడాళ్ళు అంటే ఏమాత్రం గౌరవం లేని ఈ వెధవకు బాగా అయింది...' అని పవిత్ర మనసులో అనుకుని పైకి మాత్రం లింగబాబుతో ఓదార్పు మాటలు ఒలక బోసింది పవిత్ర.

✦✦✦

ఎవరో ఒకావిడ స్నానం చేస్తున్న దానిని వీడియో తీశారనీ ఆ అవమానం భరించలేక ఆవిడ ఆత్మహత్య చేసుకుందన్న విషయాన్ని టీవీన్యూస్‌లో చూపిస్తూ వుంటారు. దాన్ని ఉద్దేశించి తన భార్య రూపాతో లింగబాబు–

"ఆవిడకేమైనా మెంటలా?...అంత మాత్రానికే ఆత్మహత్య చేసుకోవాలా?" అని అంటే...

"మరి సిగ్గూ శరం వున్న ఏ ఆడదైనా అలాగే చేస్తుంది." అని అంటుంది రూప.

దాంతో మరింత టెన్షన్‌తో గిలగిల కొట్టుకుంటాడు లింగబాబు.

రూప చాలా పద్ధతి గల ఆడది. పరాయి మగాడు ఆమె నడుము వైపు చూసినా తనకి నచ్చదు. అలాంటిది తమ 'శోభనం రోమాన్స్' బయటి వాళ్ళు ఎవరైనా చూస్తే తన భార్య ఏం చేస్తుందో లింగబాబు ఊహించడానికే భయపడిపోయాడు.


ఇన్నాళ్ళూ కాపాడుకున్న తమ పరువు ప్రతిష్టలు మంట కలసిపోవడం గ్యారంటీ అని అనుక్షణం ఆందోళన పడసాగేడు.

పెన్ డ్రైవ్ కనిపించకుండా పోయిన తర్వాత లింగబాబు ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. తన వైపు ఎవరైనా అదోలా చూసినా వాళ్ళని అనుమానిస్తున్నాడు. పెన్‌డ్రైవ్ ఇవ్వమని వాళ్ళతో గొడవ పెట్టుకుంటున్నాడు... అన్నోన్ నెంబర్ నుండి ఫోన్ కాల్స్ వస్తే... బ్లాక్ మెయిలర్స్ పెన్‌డ్రైవ్ గురించి ఏమైనా చేస్తున్నరేమోనని భ్రమపడి లిఫ్ట్ చేయడానికి భయపడిపోతున్నాడు. ఎవరైనా ఆ వీడియో ఫుటేజీని సోషల్ మీడియాలో పెట్టేస్తారేమో నన్న టెన్షన్‌తో వణికిపోతున్నాడు... సరిగా అన్నం తినలేకపోతున్నాడు. నిద్రరాక రాత్రంతా మేలుకునే వుంటున్నాడు. ఆఫీస్‌లో కూడా చెప్పిన పని సరిగా చేయలేక బాస్ చేత తిట్లు తింటున్నాడు. ఎప్పుడూ మందు తాగని వాడు పగటి పూట కూడా తాగేస్తున్నాడు. తనకున్న టెన్షన్ పోగొట్టుకోడానికి డాక్టర్స్ సలహా మీద టాబ్లెట్స్ వాడుతున్నాడు. ఒక్కోసారి మతి స్థిమితం లేని వాడిలా బిహేవ్ చేస్తున్నాడు.

లింగబాబు వాలకం చూసిన కొంతమంది తొందర్లో మెంటల్ హాస్పిటల్ మెట్లు ఎక్కే అవకాశం వున్నట్లు మాట్లాడుసాగేరు.

గతంలో పవిత్ర మీద లింగబాబు కుళ్ళు జోకులు వేసి ఆమెని హర్ట్ చేశాడు.. అది గుర్తుకు తెచ్చుకుని లింగబాబుని ఆ స్థితిలో చూసిన పవిత్ర 'వీడికి ఇలాగ కావాల్సిందే' అని మనుసులో అనుకుని లోలోన సంతోషించింది.

✦✦✦




వన్ ఫైన్ డే హాల్లో కూర్చొని వున్న లింగబాబుకు అయన భార్య రూప... కనిపించకుండా పోయిన లాంటిదే ఓ పెన్‌డ్రైవ్‌ని ఇస్తూ ...

"ఇది మీదేనా? పొద్దున్న కంప్యూటర్ టేబుల్ కింద ఊడుస్తుంటే కనిపించింది" అని ఇచ్చి కేజువల్‌గా కిచెన్‌లోకి వెళ్ళిపోయింది.

లింగబాబు ఆదరాబాదరాగా తన కంప్యూటర్ వున్న రూమ్‌లోకి వెళ్లి ఆ పెన్‌డ్రైవ్‌ని పెట్టి చూశాడు.

అందులో కనిపించిన దృశ్యాలు చూసి కనిపించకండా పోయిన పెన్‌డ్రైవే అదే అయినందుకు ఆనందంతో ఎగిరి గెంతులు వేయబోయి ఆగిపోయాడు.

కారణం అక్కడే నిలబడి లింగబాబు వైపు రూప సీరియస్‌గా చూస్తోంది.

"ఏంటీ ఆ పైత్యం? ఒకవేళ ఆ పెన్‌డ్రైవ్ బయట వాళ్ళ చేతుల్లో పడుంటే ఏమైపోయేవాళ్ళం? పిచ్చికి కూడా ఓ హద్దు వుంటుంది. ఇలా చేయాలని నీకు ఎందుకు అనిపించింది?' అని ఇలా గంటసేపు నాన్‌స్టాప్‌గా లింగబాబుకి బాగా గడ్డి పెట్టింది రూప.

లింగబాబు తను చేసిన దుశ్చర్యని సమర్థించుకునే సాహసం చేయలేక సైలెంట్ మూడ్‌లో ఉండిపోయాడు.

"ఇన్నాళ్ళూ నువ్వు పడుతున్న టెన్షన్ నేను గమనిస్తున్నా తెలీనట్టు నటించాను. నిజానికి నాకు ఆ పెన్‌డ్రైవ్ కంప్యూటర్ టేబుల్ కింద దొరకలేదు... నీ సీక్రెట్ బాక్స్‌లో నుండి నేనే తీసుకుని దాచిపెట్టాను. ఎందుకంటే నువ్వు చేసిన ఆ మతిలేని తింగరి పనికి నువ్వు పడ్డ ఆందోళన, స్ట్రెస్, ప్రెజర్, యాంగ్జైయిటీ, ఒత్తిడి... నీకు కొన్నాళ్ళు అవసరం అనిపించింది." అని అంది రూప.

"దిసీజ్ నాట్ ఫెయిర్ రూప! ఇన్నాళ్ళు నేను ఎంత టార్చర్ అనుభవిస్తున్నానో నీకు తెలిసీ కూడా ఈ పెన్ డ్రైవ్ సంగతి చెప్పకపోవడం అన్యాయం!"

"ఇక ఏడ్చింది చాలు గానీ... ఇకనైనా ఆ పెన్‌డ్రైవ్‌లో వున్న ఆ దిక్కుమాలిన వీడియో డిలీట్ చేయ్!" అని అంది రూప.

"అది కాదు రూపా! ఇది ఒక్క కాపీనే వుంది. ఇక దీన్ని చాలా జాగ్రత్తగా పెడతాను. కొన్నేళ్ళ తర్వాత మనం చూస్తే ఆ మజా ..." అని మాట పూర్తి చేయకముందే లింగబాబు చెంప చెళ్ళుమనిపించింది రూప.

దాంతో దిగ్గున కింద పడ్డాడు లింగబాబు.

ఊహించని ఆ దెబ్బ కు కాసేపు లింగబాబు కళ్ళు బైర్లు కమ్మాయి.

ఆ షాక్ నుండి తేరుకుని చూసేసరికి ఆ పెన్‌డ్రైవ్ ని రూప డంబెల్ తో కొడుతూ పచ్చడి పచ్చడి చేస్తోంది.

ఎన్నో ఏళ్ళుగా దాచిపెట్టుకున్న ఆ 'తీపి జ్ఞాపిక' ని రూప అలా చేయడంతో చిన్న పిల్లాడిలా ఏడ్చేశాడు పాపం లింగబాబు.

# పదానందం 18

కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | ■ | 4 | 5 |
| | ■ | | ■ | 6 | | ■ | |
| | ■ | 7 | | | ■ | 8 | |
| ■ | 9 | | ■ | 10 | | | ■ |
| 11 | ■ | 12 | | | ■ | | ■ |
| 13 | | | ■ | ■ | 14 | | |
| | ■ | 15 | 16 | ■ | ■ | | ■ |
| 17 | | ■ | 18 | | | ■ | 19 |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. సుప్రభాతం (5)
4. పరిమళం (2)
6. తడబడుతూ మాట్లాడే జబ్బు (2)
7. ఒక భయంకరమైన అంటువ్యాధి (3)
8. గింజ (2)
9. కలంలో నింపి రాసే ద్రవం (2)
10. మొత్తం విషయం (3)
12. కట్టబడినది (3)
13. తిరగబడ్డ ఆస్థానం, ఉద్యోగం (3)
14. నగర లేదా పట్టణ పరిసర ప్రాంతం (3)
15. తిరగబడ్డ పడక (2)
17. అసూయలాంటిది అటునించి (2)
18. భీష్ముని చంపుటకొరకు అంబ ఈ విధంగా మారింది (3)
19. మహిళ (1)

**నిలువు**

1. తెలివిగలవ్యక్తి (3)
2. లొంగుబాటు కాని వ్యక్తిని ఇలా అంటారు (7)
3. జరిగినది మళ్ళీ జరగడం (5)
5. ఆపద (3)
8. అడ్డదిడ్డమైన వాదాన్ని ఇలా అంటారు (5)
11. సన్యాసులు వాడేవి, శుభకార్యాలలో వాడే చెక్క పాదుకలు (4)
16. చంద్రుడు (2)

సమాధానం వచ్చే సంచికలో


**గత సంచిక సమాధానం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 హ | రి | 2 దా | సు | ■ | 3 మొ | ద | లు |
| డా | ■ | ప | ■ | 4 ప | ద్దు | ■ | ■ |
| 5 వి | హా | రి | ■ | డ | ■ | 6 బా | 7 కా |
| డి | ■ | 8 కం | 9 ద | గ | 10 డ్డ | ■ | మం |
| ■ | 11 స | ■ | ర | ■ | 12 బి | 13 రు | దు |
| 14 ఫ | రం | ల | హా | ■ | ■ | దా | ■ |
| ■ | జా | ■ | 15 సం | 16 ని | జీ | వ | ■ |
| 17 రు | మా | లు | ■ | కు్క | ■ | 18 దే | హం |

మనోవికాసానికి మందు ఆనందం!
హాస్యానందం తోనే ఇది సాధ్యం!
చందాదారులుగా చేరండి. నవ్వుని మీ స్వంతం చేసుకోండి!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# మొక్క మనసు


దాని యింటిగుట్టు
అసలు బయటకే రానివ్వదు
వదినా!! లోపల
ఏమి జరుగుతుందో తెలియదు...
నేను లేనిదే మీరు
బ్రతకలేరు కానీ చీకటి పడితే
మాత్రం ఆ చంద్రుడితో
ప్రేమ కలాపాలు సాగిస్తారు!!
అందరం ఎక్కితే
మన బరువుకి ఈ చెట్టు
ఆగుతుందంటావా?!
మీరు నా మీద కూర్చుని
ఈ మోడు బారిని జీవితానికి
తిరిగి పచ్చదనాన్నిచ్చారు
చిలకలూ!!
చీకటి పడగానే
ప్రతిరోజూ మనం
కలుసుకుంటున్నాం
కదా.. ఈ సమాజం
మన గురించి
తప్పుగా అనుకుంటుందేమో
మావా!!
పెద్దయ్యాక
నేను కూడా ఆ చంద్రుడ్ని
ముద్దాడాలి!!

Hasyanandam February-2025 RNI No. APTEL 08387/01/1/2003-TC




**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548